ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
5 వరంగల్
శనివారం 7 సెప్టెంబరు 2024

9న నగరానికి సీఎం
వివరాలు 6లో..

కబ్జా పర్వం - 3


దేవుడి మాన్యాలనూ దోచేశారు!

వరంగల్ నగరంలో యథేచ్ఛగా ఆలయాల భూములు కబ్జా

- 17 ఆలయాలకు చెందిన 350 ఎకరాలు హాంఫట్
- పలు ప్రధాన ఆలయాల ఆస్తులకూ ఎసరు
- సర్వేతో అక్రమాలను గుర్తించి.. చర్యలకు దిగని దేవాదాయ శాఖ
- అడ్డంకిగా నేతల ఒత్తిళ్లు, కోర్టు నోటీసులు

కబ్జారాయుళ్లు బరితెగిస్తున్నారు. ఖాళీ స్థలాలు, ప్రభుత్వ నాలాలు, చెరువు శిఖం భూములే కాదు.. చివరికి దేవుడి భూములను కూడా దోచేశారు. వరంగల్ మహానగరంలో రూ.వేల కోట్ల విలువైన దేవాలయాల భూములను ఆక్రమిస్తున్నారు. నకిలీ పత్రాలు, పక్క సర్వే నెంబర్లుతో రిజిస్ట్రేషన్ చేయించుకుని ఆలయ భూముల్లో తిష్ట వేస్తున్నారు. నగరంలోని పద్మాక్షి ఆలయం, మెట్టుగుట్ట శ్రీరామలింగేశ్వర స్వామి, శ్రీరంగనాయకస్వామి గుడి, ఎర్రగట్టుగుట్ట, శ్రీగోవిందరాజులగుట్టతో పాటు మరో 17ప్రముఖ ఆలయాలకు చెందిన వందల ఎకరాల భూములు స్వాహా అవుతున్నాయి. ఈ దేవుడి భూముల అన్యాక్రాంతంపై దేవాదాయశాఖ అధికారులు సర్వేతోనే సరి పెట్టుకోవాల్సి వస్తోంది. నేతల ఒత్తిళ్లకు తోడు.. కోర్టు నోటీసులు చర్యలకు అడ్డుగా మారుతున్నాయి. దీంతో దేవుడి భూములను కబ్జాకోరుల నుంచి విముక్తి కల్పించేందుకు ప్రభుత్వం చొరవచూపాలని నగరవాసులు కోరుతున్నారు.

- ఆంధ్రజ్యోతి ప్రతినిధి, వరంగల్



మడికొండలోని మెట్టుగుట్ట చుట్టూ వెలసిన భవనాలు, నిర్మాణాలు

వివరాలు 7లో..

రావయ్య.. గణపయ్య!

నేడు వినాయక చవితి

- నేటి నుంచి గణపతి నవరాత్రి ఉత్సవాలు
- వాడవాడలా ముస్తాబైన మండపాలు
- పరిమళించనున్న ఆధ్యాత్మిక సౌరభం
- పలుచోట్ల మట్టి విగ్రహాల పంపిణీ



వరంగల్‌లోని ఎంజీఎం సెంటర్ నుంచి వినాయక విగ్రహాలను తరలిస్తున్న మండపాల నిర్వాహకులు

వివరాలు 8లో..

సెల్‌ఫోన్ పోతే సీఈఈఆర్ పోర్టల్‌లో ఫిర్యాదు చేయండి



యువతి పోగొట్టుకున్న ఫోన్‌ను అందిస్తున్న సీపీ అంబర్ కిషోర్ ఝూ

వరంగల్ సీపీ అంబర్ కిషోర్ ఝూ

వరంగల్‌క్రైం, సెప్టెంబర్ 6: సెల్ యజమానులు తమ ఫోన్ పోగొట్టుకుంటే వెంటనే సీఈఈఆర్ పోర్టల్‌లో ఫిర్యాదు చేయాలని వరంగల్ పోలీస్ కమిషనర్ అంబర్ కిషోర్ ఝూ సూచించారు. సీఈఈఆర్ పోర్టల్ ద్వారా అందిన ఫిర్యాదుల మేరకు సీసీఎస్‌పోలీసులు పట్టుకున్న సెల్‌ఫోన్‌లను శుక్రవారం వరంగల్ పోలీస్ కమిషనర్ అంబర్ కిషోర్ ఝూ చేతులమీదుగా అందచేశారు. ఈ సందర్భంగా సీపీ మాట్లాడుతూ.. దొంగతనం జరిగినా, పోగొట్టుకున్న ఫోన్ల ఆచూకీ తెలుసుకునేందుకు సీసీఎస్‌తోపాటు ప్రతీ పోలీస్‌స్టేషన్‌లో ప్రత్యేక విభాగాన్ని ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఇప్పటి వరకు 7,427 సీఈఈఆర్ పోర్టల్‌లో ఫిర్యాదులు రాగా, 3,998 గుర్తించి అందులో 2,846 ఫోన్లను యజమానులకు అందజేశామన్నారు. ఈ వారం రోజుల్లో 102 ఫోన్లను స్వాధీనం చేసుకున్నట్లు ఆయన అన్నారు. ఎవరైనా ఫోన్ పోగొట్టుకుంటే నంబర్ బ్లాక్ చేసి సీఈఈఆర్ పోర్టల్‌లో ఫిర్యాదు చేయాలని సీపీ అంబర్ కిషోర్ ఝూ సూచించారు. ఈ కార్యక్రమంలో సీసీఎస్ ఇన్‌స్పెక్టర్ అబ్బయ్య, ఐటీ కోర్ ఇన్‌స్పెక్టర్ శ్రీనివాస్, ఎఎస్ఐ గోపాల్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఐక్య ఉద్యమాలతోనే బీసీ హక్కుల సాధన

- డిక్లరేషన్ అమలు కోసం ఉద్యమం
- వివిధ పార్టీలు, సంఘాల పిలుపు



సమావేశంలో మాట్లాడుతున్న దాస్యం వినయ్ భాస్కర్

వడ్డెపల్లి, సెప్టెంబరు 6: ఐక్య ఉద్యమాలతోనే బీసీ హక్కుల సాధన సాధ్యమవుతుందని, కామారెడ్డి డిక్లరేషన్ అమలు కోసం మహా ఉద్యమం, మరో పోరాటం చేయాల్సిన సమయం ఆసన్నమైందని ఆల్ పార్టీ రౌండ్ టేబుల్ సమావేశంలో వివిధ పార్టీలు, సంఘాల నేతలు, వక్తలు పిలుపునిచ్చారు. ఆల్ ఇండియా ఓబీసీ జాక్ ఆధ్వర్యంలో హనుమకొండ బాలసముద్రంలోని ప్రెస్ క్లబ్‌లో తెలంగాణ జిల్లాల పూలే యువజన సంఘం రాష్ట్ర కన్వీనర్ తాడిశెట్టి క్రాంతి కుమార్ అధ్యక్షతన నిర్వహించిన కామారెడ్డి డిక్లరేషన్ అమలు, సమగ్ర కులజనగణన, స్థానిక సంస్థల్లో 42 శాతం రిజర్వేషన్ సాధన కోసం రౌండ్ టేబుల్ సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా బీఆర్ఎస్ హనుమకొండ జిల్లా అధ్యక్షుడు దాస్యం వినయ్ భాస్కర్ మాట్లాడుతూ.. కామారెడ్డి డిక్లరేషన్ అమలు కోసం జరిగే ఉద్యమంలో బీఆర్ఎస్ ముందుంటుందన్నారు. మహాత్మాజ్యోతిరావుపూలే చూపిన మార్గంలో బహుజన హక్కుల కోసం ఎన్నో పోరాటాలు జరిగిన వరంగల్‌లో తెలంగాణ ఉద్యమం వల్ల వెనక్కి తగ్గారని అన్నారు. తెలంగాణ ఉద్యమస్ఫూర్తితో బీసీ హక్కుల సాధన ఉద్యమం చేయాలని బీసీ సమాజానికి పిలుపునిచ్చారు. ఆల్ ఇండియా ఓబీసీ జాక్ చైర్మన్ సాయిని నరేందర్ మాట్లాడుతూ.. సకల సామాజికరంగాల్లో జనాభా దామాషా ప్రకారం వాటా కోసం జరిగే పోరాటంలో ఆల్ ఇండియా ఓబీసీ జాక్ ముందు నడుస్తుందని స్పష్టం చేశారు. చట్ట సభల్లో బీసీ వాటా కోసం రాష్ట్రంలో 400 కిలోమీటర్ల పాదయాత్ర చేశామని తెలిపారు.

తెలంగాణలో కాంగ్రెస్ పార్టీ కామారెడ్డి డిక్లరేషన్‌లో పొందుపర్చిన అంశాలను సాధించడం కోసం పూలే, బీఆర్ అంబేద్కర్, పెరియార్ రామస్వామి, కొండా లక్ష్మణ్‌బాపూజీ వంటి మహనీయుల స్ఫూర్తితో ఉద్యమించాలని పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో చిరుతల కక్షి పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ జిలుకర శ్రీనివాస్, ఆల్ ఇండియా ఓబీసీ జాక్ వైస్ చైర్మన్ పటేల్ వనజ, సీపీఐ జిల్లా కార్యదర్శి కర్రె బిక్షపతి, సీపీఎం నేత తిరుపతి, టీడీపీ నేత అర్షనపల్లి విద్యాసాగర్‌రావు, ప్రజా సంఘాల నాయకులు దారం జనార్ధన్, కేడెల ప్రసాద్, గొల్లపల్లి వీరస్వామి, సోమా రామమూర్తి, ప్రొఫెసర్ ప్రభంజన్ యాదవ్, చింతకింది కుమారస్వామి, సారంగపాణి, గురిమిళ్ల రాజు, చింతం ప్రవీణ్‌కుమార్ కోంద్ర నర్సింగరావు, చుంచు రాజేందర్ తదితరులు పాల్గొన్నారు.

పీడీఎస్ బియ్యం పట్టివేత

రూ.27 క్వింటాళ్ల రైస్ స్వాధీనం

వరంగల్ క్రైం, సెప్టెంబర్ 6: హనుమకొండ జిల్లా కాజీపేట మండలం మడికొండ పోలీస్‌స్టేషన్ పరిధిలోని అమ్మవారిపేటలో రూ.71వేల విలువ కలిగిన 27 క్వింటాళ్ల పీడీఎస్ బియ్యాన్ని టాస్క్‌ఫోర్స్ పోలీసులు పట్టుకున్నారు. ఎస్.యుగంధర్ అనే వ్యక్తి అమ్మవారిపేటలో తన కోళ్లఫామ్‌లో నిల్వ ఉంచిన పీడీఎస్ రైస్‌ను శుక్రవారం టాస్క్‌ఫోర్స్ పోలీసులు దాడులు చేసి స్వాధీనం చేసుకున్నారు. విచారణ నిమిత్తం యుగంధర్‌ను మడికొండ పోలీసులకు అప్పగించారు. ఈ విషయాన్ని టాస్క్‌ఫోర్స్ సీఐ ఎస్.రవికుమార్ ధ్రువీకరించారు.

9న వరంగల్ నగరానికి సీఎం

బాలసముద్రం, సెప్టెంబరు 6 : సీఎం రేవంత్‌రెడ్డి ఈనెల 9న వరంగల్ నగరానికి రానున్నట్లు ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి తెలిపారు. ఈనెల 9 తేదీన మధ్యాహ్నం మూడు గంటలకు ఆర్ట్స్ కాలేజీకి చేరుకుంటారన్నారు. నయీంనగర్ బ్రిడ్జిని, కాళోజీ కళాక్షేత్రంకు ప్రారంభిస్తారన్నారు.

చాక్‌పీసులపై వినాయకుల చిత్రీకరణ



చెన్నారావుపేట, సెప్టెంబరు 6: మండల కేంద్రంలోని సిద్ధార్థ హైస్కూల్ ఉపాధ్యాయురాలు కాచ వరపు సంధ్య చాక్‌పీసులపై వినాయక దేవుళ్లను శుక్రవారం చిత్రీకరణ చేశారు. తన మైక్రో ఆర్టిస్టుతో వినాయక దేవుళ్ల చిత్రంతో పాటు మట్టి విగ్రహాలను ప్రతిష్ఠించండి.. ఏకో ఫ్రెండ్లీ గణేష్, జై గణేష్.. అనే నినాదాలను చాక్‌పీసులపై చిత్రీకరించారు. ఈ సందర్భంగా పాఠశాలలో ఏర్పాటు చేసిన సమావేశంలో సంధ్యను సిద్ధార్థ విద్యాసంస్థల చైర్మన్ కంది గోపాల్‌రెడ్డి, ప్రిన్సిపాల్ అండెం కర్ణాకర్‌రెడ్డిలో పాటు పలువురు ఉపాధ్యాయులు సన్మానం చేశారు. ఈ కార్యక్రమంలో మేడి రమేష్ గౌడ్, కృష్ణమోహన్, వల్ల వేణు, భద్రు, వైనాల రాజు, జున్నూతుల కవిత, బొజ్జ స్వప్న, కుండె రోజారాణి, సృజన, పొగాకుల రోజా, కేతిడి గౌతమి, దొంతి స్రవంతి, లక్క శ్రావణి, ప్రియాంక తదితరులు పాల్గొన్నారు.

వరంగల్ మార్కెట్ ధరలు

పంట	క్వింటా గరిష్ట	
మక్కలు (బిల్టీరకం)	3015	[illegible]
పల్లికాయ (సూక)	5400	[illegible]
పల్లికాయ (పచ్చిది)	[illegible]	[illegible]
పెసర్లు	7352	4552
[illegible]	[illegible]	[illegible]
పసుపు (కాడి)	12059	10000
పసుపు (గోలా)	12059	10009
తేజ మిర్చి	12000	9000
తేజ ఏసీ	18200	14000
వండర్ హాట్ ఏసీ	18500	13000
341 ఏసీ	14500	11000
దేశీ ఏసీ	25000	20000
[illegible]	[illegible]	[illegible]

ఎంజేపీ ఆర్‌సీవోగా రాజ్‌కుమార్ నియామకం


వరంగల్ ఎడ్యుకేషన్, సెప్టెంబరు 6: మహాత్మ జ్యోతిబా పూలే తెలంగాణ బీసీ గురుకులాల రీజనల్ కోఆర్డినేటర్‌గా పూర్తిస్థాయి అదనపు బాధ్యతలను ఎం.రాజ్‌కుమార్‌కు అప్పగిస్తూ ఎంజేపీటీ గురుకులాల కార్యదర్శి బి.సైదులు శుక్రవారం ఉత్తర్వులు జారీ చేశారు. ప్రస్తుత ఆర్‌సీవో వై.మనోహర్‌రెడ్డి అనారోగ్య కారణాలతో తనను రీవోక్ చేయాల్సిందిగా కోరడంతో రాజ్‌కుమార్‌కు బాధ్యతలు అప్పగిస్తున్నట్లు సెక్రెటరీ ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. కాగా రాజ్‌కుమార్.. ప్రస్తుతం కరీంనగర్ జిల్లా కొత్తపల్లిలోని ఎంజేపీటీ బాయ్స్ ప్రిన్సిపాల్‌గా పనిచేస్తున్నారు.

ఐటీఐల్లో ప్రవేశాలకు దరఖాస్తుల ఆహ్వానం

వరంగల్ ఎడ్యుకేషన్, సెప్టెంబరు 6: ప్రభుత్వ ప్రైవేటు ఐటీఐల్లో నాలుగో దశ ప్రవేశాల కోసం దరఖాస్తులు చేసుకోవాల్సిందిగా వరంగల్ ప్రభుత్వ ఐటీఐ ప్రిన్సిపాల్ ఎం.చందర్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నెల 20 ఉదయం 11గంటల లోపు ఆన్‌లైన్‌లో దరఖాస్తులు చేసుకోవాలని రోజువారి మెరిట్ ప్రాతిపదికన మాత్రమే సీట్ల కేటాయింపు జరుగుతుందని తెలిపారు. ఈ నెల 11 నుంచి 20 వరకు ప్రతీ రోజు సంబంధిత ఐటీఐలో ఉదయం 11 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటిగంట వరకు ఒరిజినల్ సర్టిఫికెట్లతో హాజరు కావాలన్నారు.

రాష్ట్ర ఉత్తమ ఉపాధ్యాయుడికి సన్మానం

వరంగల్ ఎడ్యుకేషన్, సెప్టెంబరు 6: ఆయనో ప్రభుత్వ పాఠశాలలో ప్రధానోపాధ్యాయుడిగా పనిచేస్తున్నారు. ఈయన పేరు గౌరిశెట్టి రాజన్న గెజిటెడ్ హెడ్మాస్టర్. అయితేంటని అంటారా...? హనుమకొండ జిల్లా వేలేరు మండల కేంద్రం వాసి అయిన ఈయన తండ్రి గౌరిశెట్టి గోవర్దన్ ఇక్కడ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో విద్యను అభ్యసించారు. తర్వాత గౌరిశెట్టి రాజన్న ఇదే పాఠశాలలో చదుకున్నారు. ఇప్పుడు అదే పాఠశాలలో ప్రధానోపాధ్యాయుడిగా పనిచేస్తున్నారు. ఇంతే కాదు.. రాజన్నకు ముగ్గురు సంతానం ఇదే పాఠశాలలో విద్యను అభ్యసించడం విశేషం. వంశీధర్, శాంతిప్రియ, సాయికృష్ణలు ఇక్కడే చదువుకున్నారు. తాను చదువుకున్న పాఠశాలకే ప్రధానోపాధ్యాయుడు అయిన రాజన్న దాతల సహాయంతో పాఠశాల చుట్టూ ప్రహరీగోడతో పాటు గేటను ఏర్పాటు చేశారు. కాగా, ఈయన ప్రభుత్వానికి ఉత్తమ ఉపాధ్యాయుడి అవార్డు కోసం దరఖాస్తు చేసుకోలేదు. రాష్ట్ర ప్రభుత్వమే రాష్ట్రంలోని ఇలాంటి సేవలు అందించిన వారికి ప్రత్యేకంగా ఫోర్‌రన్నర్స్ పేరుతో రాష్ట్ర ఉత్తమ ఉపాధ్యాయులుగా సత్కారం అందజేస్తారు. గురువారం హైదరాబాద్‌లోని రవీంద్రభారతిలో రాష్ట్ర ప్రభుత్వం నిర్వహించిన గురుపూజోత్సవంలో గౌరిశెట్టి రాజన్నను ఉత్తమ ఉపాధ్యాయుడి సత్కారంతో గౌరవించారు.



హనుమకొండ నడిబొడ్డున ఉన్న పద్మాక్షిగుట్ట చుట్టూ విరివిగా వెలసిన నిర్మాణాలు



వరంగల్ బస్‌స్టేషన్ సమీపంలోని గోవిందరాజుల ఆలయం చుట్టూ నిర్మితమైన ఉన్న భవనాలు, నిర్మాణాలు

దేవుడి మాన్యాలనూ దోచేశారు!

● వరంగల్ నగరంలో యథేచ్ఛగా ఆలయాల భూములు కబ్జా ● 17 ఆలయాలకు చెందిన 350ఎకరాల హాంఫట్

(ఆంధ్రజ్యోతి ప్రతినిధి, వరంగల్)

కాకతీయుల రాజధానిగా వెలుగొందిన వరంగల్‌లో అనేక పుణ్యక్షేత్రాలున్నాయి. అంతేకాదు కాకతీయులకు పూర్వం నిర్మించిన ఆలయాలు కూడా ఎన్నో ఉన్నాయి. భద్రకాళి ఆలయం, వెయ్యి స్తంభాల గుడితో పాటు పద్మాక్షిమాత ఆలయం, సిద్ధేశ్వరాలయం, జలేశ్వరాలయం, ఎర్రగట్టు లక్ష్మీనర్సింహస్వామి ఆలయం, మెట్టుగుట్ట రామలింగేశ్వరాలయం, శ్రీరంగనాయక ఆలయం, శ్రీ వేంకటేశ్వరస్వామి, వేణుగోపాలస్వామి ఆలయంతో పాటు అనేక ఆలయాలకు నిలయం వరంగల్. ఈ చారిత్రత్మక ఆలయాల పోషణ కోసం పూర్వమే ఎకరాలకొద్ది భూములను కేటాయించారు. టెంపుల్ సిటీగా వరంగల్ మహనగరం అభివృద్ధి చెందుతున్న క్రమంలోనే కబ్జాకోరులు ఆయలయాల మాన్యాలపై కన్నేసి దోచేస్తున్నారు. దీంతో వందల ఎకరాల భూములు మాయమవుతున్నాయి.

కబ్జా కోరల్లో ప్రముఖ ఆలయాల భూములు

వరంగల్ మహనగరంలో వెయ్యికి పైగా ఆలయాలున్నాయి. దేవాదాయశాఖ పరిధిలో ఉన్న ఆలయాలతో పాటు స్థానికులు నిర్మించుకున్న ఆలయాలు, ట్రస్టు ఆధ్వర్యంలో ఏర్పాటు చేసుకున్న దేవాలాయలున్నాయి. వీటిలో అనేక ప్రముఖ ఆలయాలు దేవాదాయ శాఖ ఆధీనంలో ఉన్నాయి. అయితే దేవాదాయశాఖ ఆధీనంలో ఉన్న అనేక ఆలయాల భూములు కబ్జాలకు గురవుతున్నాయి. ప్రధానంగా హనుమకొండ పట్టణ నడిబొడ్డున ఉన్న పద్మాక్షిమాత ఆలయ భూములను దర్జాగా కబ్జా చేస్తున్నారు. ఈ ఆలయానికి సంబంధించి సర్వే నెంబర్లు 901, 902, 903, 904, 905, 906, 535, 890/బీ, 880లలో మొత్తం 72.23ఎకరాలున్నాయి. వీటిలో 8.20ఎకరాలు కబ్జాకు గురయ్యాయి. ఇందులో ఆరుగురు ప్రముఖులు దేవాలయ భూమిని అక్రమించుకుని దర్జాగా ఇళ్లు నిర్మాణం చేసుకున్నారు. ఈ అక్రమాలపై విచారణ జరిపిన అధికారులు ఎలాంటి చర్యలు తీసుకోకుండా చేతులెత్తేశారనే ఆరోపణలు ఉన్నాయి. అలాగే పద్మాక్షి గుట్టకు సంబంధించిన 78.30ఎకరాల భూములు ఉండగా, ఈ భూములను పోరంబోకుగా మార్చారు. వీటిలో సుమారు 18ఎకరాలకు పైగా కబ్జాకు గురైంది. అలాగే హనుమకొండలోని సిద్దేశ్వరాలయానికి సంబంధించిన సర్వే నెం.882లో 24.03ఎకరాల భూమి ఉంది. ఇందులో 9గుంటల స్థలం ప్రముఖ విద్యాసంస్థల యాజమాని కబ్జా చేసి నిర్మాణాలు చేపట్టారు. అలాగే కాజీపేటలోని మెట్టుగుట్ట శ్రీరామలింగేశ్వరస్వామి ఆలయ భూములు 59.07ఎకరాలు ఉండగా 1.39ఎకరాల భూములు కబ్జాకు గురయ్యాయి. అలాగే మాత మునులపాటి వీరపిచ్చమాంబ పీఠంకు చెందిన సర్వే నెం. 879లో 1.14ఎకరాల భూమి ఉండగా, 10గుంటల భూమిని ఆరుగురు ఆక్రమించుకున్నట్టు దేవాదాయశాఖ గుర్తించింది.

హన్మద్గిరి రంగనాయకస్వామి ఆలయం (పెద్ద కోవెల) సర్వే నెం.552, 592/1, 807లలో 13.34 ఎకరాల భూమిలో 9.13ఎకరాల భూమిని 34మందికి పైగా ఆక్రమించుకుని పక్కా ఇళ్లు, భవనాలు నిర్మించుకున్నారు. వరంగల్ మట్టేవాడలోని శ్రీవేణుగోపాలస్వామి ఆలయానికి 4.21ఎకరాల భూములున్నాయి. ఈ భూముల్లో 1.11ఎకరాలను ఆక్రమించుకుని విద్యాసంస్థలు, పంక్షన్‌హాళ్లు, షాపింగ్ కాంప్లెక్స్‌లను నిర్మించుకున్నారు. అలాగే వరంగల్ గోవిందరాజుల గుట్ట మొత్తం 5.25ఎకరాల్లో విస్తరించి ఉండగా సుమారు 2.25ఎకరాల భూములు కబ్జాకు గురయ్యాయి. వరంగల్ రామన్నపేటలోని శ్రీమల్లికార్జునస్వామి (కుంటిభద్రయ్య) గుడికి 10ఎకరాల భూమి ఉంటే 8.10ఎకరాలు ఆక్రమణకు గురైంది. అలాగే రంగంపేటలోని హనుమాన్ గుడి5.38ఎకరాల భూమి ఉంటే మొత్తం భూమి స్వాహా చేశారు. అలాగే ఖిలా వరంగల్‌లోని స్వయంభు శంభులింగేశ్వరస్వామి ఆలయానికి 3.09ఎకరాల భూమి ఉంటే 33గుంటల భూమిని కబ్జాకోరులు అక్రమించారు. దేశాయిపేటలోని శ్రీరంగనాయకస్వామి ఆలయానికి చెందిన 19.19ఎకరాల భూములు ఉంటే 7.35ఎకరాల భూములు కబ్జాకు గురయ్యాయి. రంగాశాయిపేటకు చెందిన శ్రీసీతారామచంద్ర ఆలయానికి 22.29ఎకరాల భూములు ఉండగా, వీటిలో విలువైన 554.15చదరపు గజాల స్థలం అక్రమణకు గురైంది.

హనుమకొండ జిల్లా మడికొండలోని శ్రీసీతారామచంద్ర స్వామి ఆలయానికి చెందిన 470.34ఎకరాల భూములు ఉంటే, వాటిలో 264.34ఎకరాల భూములను స్వాహ చేశారని దేవాదాయశాఖ గుర్తించింది. అలాగే హసన్‌పర్తి మండలం ఎర్రగట్టు శ్రీవేంకటేశ్వరస్వామి ఆలయానికి చెందిన 12.30ఎకరాల భూములు ఉండగా, 3.06ఎకరాలు అన్యాక్రాంతమయ్యాయి. హనుమకొండలోని జగదీష్‌మందిర్‌కు చెందిన 15.21ఎకరాల భూములన్నీ స్వాహా చేశారు. హనుమకొండ రాగన్నదర్వాజలోని శ్రీసీతారామచంద్రస్వామి ఆలయానికి చెందిన 4.33ఎకరాల భూములు ఉండగా, వీటిలో 1.38ఎకరాల అత్యంత విలువైన భూములు కబ్జాకు గురయ్యాయి. మడికొండలోని శ్రీ వేణుగోపాలస్వామి ఆలయానికి సంబంధించిన 9.04ఎకరాల భూముల్లో 1.36ఎకరాల భూములను మాయం చేశారు. వీటితో పాటు వరంగల్‌లోని భోగేశ్వరాలయం, దుర్గేశ్వరాలయం, రాజ్‌పుత్ కాలనీలోని రామాలయం, హనుమకొండలోని శ్రీజలేశ్వరాలయం, చింతగట్టు సమీపంలోని బోడగుట్ట శ్రీరామలింగేశ్వరస్వామి ఆలయానికి చెందిన భూములు అన్యాక్రాంతమైనట్టుగా ప్రచారం జరుగుతోంది. ఇలా నగరంలోని ప్రముఖ ఆలయాలకు సంబంధించిన సుమారు 350 ఎకరాల నుంచి 500 ఎకరాల భూములు కబ్జాకు గురైనట్టు అంచనా వేస్తున్నారు. రూ.వేల కోట్ల విలువైన భూములు కబ్జాలకు గురవుతున్నా ప్రభుత్వం దృష్టి సారించటం లేదనే విమర్శలు వినిపిస్తున్నాయి. వీటిలోని ఆలయ భూములకు విముక్తి కల్పించాలని పలువురు కోర్టులో, లోకాయుక్తాలో కేసులు వేశారు.

నగరంలో దేవాదాయశాఖ గుర్తించిన ఆక్రమణలకు గురైన ఆలయ భూములివీ..

ఆలయం	ప్రాంతం	భూములు	కబ్జా భూమి
పద్మాక్షి ఆలయం	హనుమకొండ	72.23ఎకరాలు	8.20ఎకరాలు
సిద్ధేశ్వరస్వామి ఆలయం	హనుమకొండ	24.03 ఎకరాలు	0.09ఎకరాలు
ఎర్రగట్టు శ్రీవేంకటేశ్వరస్వామి	హసన్‌పర్తి	12.30ఎకరాలు	3.06ఎకరాలు
శ్రీసీతారామచంద్రస్వామి	మడికొండ	470.34ఎకరాలు	264.34ఎకరాలు
రంగనాయకస్వామి-పెద్దకోవెల	హనుమకొండ	13.34ఎకరాలు	9.13ఎకరాలు
శ్రీజగదీష్ మందిర్	హనుమకొండ	15.21ఎకరాలు	15.21ఎకరాలు
వీరపిచ్చమాంబ పీఠం	హనుమకొండ	1.14ఎకరాలు	0.10ఎకరాలు
శ్రీసీతారామచంద్రస్వామి	రాగన్నదర్వాజ	4.33ఎకరాలు	1.38ఎకరాలు
శ్రీవేణుగోపాలస్వామి ఆలయం	మడికొండ	9.04ఎకరాలు	1.36ఎకరాలు
శ్రీమెట్టు రామలింగేశ్వరస్వామి	మడికొండ	59.07ఎకరాలు	1.39ఎకరాలు
శ్రీమల్లిఖార్జునస్వామి ఆలయం	రామన్నపేట	10.00ఎకరాలు	8.10ఎకరాలు
శ్రీహనుమాన్ గుడి	రంగంపేట	5.38ఎకరాలు	5.38ఎకరాలు
శ్రీవేంకటేశ్వరస్వామి ఆలయం	రామన్నపేట	5.06ఎకరాలు	4.24ఎకరాలు
శ్రీస్వయంభుశంభులింగేశ్వరస్వామి	ఫోర్టు వరంగల్	3.09ఎకరాలు	0.33ఎకరాలు
శ్రీవేణుగోపాలస్వామి ఆలయం	మట్టెవాడ	4.21ఎకరాలు	1.21ఎకరాలు
శ్రీరంగనాయక ఆలయం	దేశాయిపేట	19.19ఎకరాలు	7.35ఎకరాలు
శ్రీసీతారామచంద్రస్వామి గుడి	రంగశాయిపేట	26.29ఎకరాలు	554.15చ.గ.

దేవుడికి భూమి దక్కేదెప్పుడో?

వరంగల్ నగరంలోని ఆలయ భూములు కబ్జాకోరల్లో చిక్కుకుని విలవిలలాడుతున్నాయి. కబ్జా భూముల్లో విద్యాసంస్థలు, షాపింగ్ మాల్స్, ఫంక్షన్ హాళ్లు, వెంచర్లు, అపార్ట్‌మెంట్లు నిర్మించారు. వేల కోట్ల రుపాయల భూములు కబ్జాలకు గురవుతున్నా స్వాధీనం చేసుకునేందుకు దేవాదాయ శాఖ దృష్టి పెట్టడం లేదనే విమర్శలు వినిపిస్తున్నాయి. చాలా వరకు అక్రమణల్లో బడా బాబులు.. విద్యాసంస్థలు అధిపతులు, వ్యాపారవేత్తలతో పాటు ప్రభుత్వంలో కీలకంగా వ్యవహరించే నేతలు కూడా ఉన్నారు. దీంతో అక్రమ కట్టడాలపై దేవాదాయశాఖ కొరడా ఝుళిపించలేకపోతుందనే చర్చ జరుగుతోంది. అంతేకాకుండా చాలా వరకు ఆలయ భూములపై కోర్టుల్లో కేసులు, లోకాయుక్తలో ఫిర్యాదులున్నాయి. ఇవన్నీ ఎప్పుడు పరిష్కారమవుతాయో ఎప్పుడు దేవుడికి భూమి దక్కుతుందో అనే ఉత్కంఠలో భక్తులున్నారు. నగరానికి చెందిన ఎమ్మెల్యే కొండా సురేఖ దేవాదాయశాఖ మంత్రిగా ఉండటంతో మహనగరంలోని అక్రమణలకు గురైన దేవాలయాల భూములకు విముక్తి కల్పించేందుకు చొరవ చూపాలని భక్తులు మంత్రికి విజ్ఞప్తి చేస్తున్నారు.

నష్టం అంచనాలకు తక్షణమే చర్యలు చేపట్టాలి

● అడవిలో జరిగిన విపత్తును కేంద్ర హోంమంత్రి దృష్టికి తీసుకెళ్తాం ● మల్కాజిగిరి ఎంపీ ఈటల రాజేందర్ ● ములుగుజిల్లాలో పర్యటన



తాడ్వాయి - మేడారం అడవుల్లో ప్రకృతి విధ్వంసంతో నేలరాలిన చెట్లను పరిశీలిస్తున్న మల్కాజిగిరి ఎంపీ రాజేందర్

తాడ్వాయి, సెప్టెంబరు 6: భారీ వర్షాలతో జరిగిన నష్టంపై అంచనా వేసేందుకు తక్షణమే చర్యలు చేపట్టాలని మల్కాజిగిరి ఎంపీ, బీజేపీ నేత ఈటల రాజేందర్ అధికారులకు సూచించారు. శుక్రవారం ములుగు జిల్లా వరద బాధిత ప్రాంతాల్లో పర్యటించిన ఆయన తాడ్వాయి మండలం జలగలంచవాగును పరిశీలించారు. అనంతరం తాడ్వాయి-మేడారం అడవుల్లో ఇటీవల విధ్వంసానికి గురైన అటవీ ప్రాంతాన్ని పరిశీలించి అక్కడి అటవీశాఖ అధికారులతో వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ.. వందలకాలం నాటి భారీ వృక్షాలు సైతం నేల రాలాయని, 500ఎకరాల్లో లక్షకుపైగా చెట్లు నేలరాలి ఉంటాయని భావిస్తున్నట్లు వెల్లడించారు. ఏ జాతి మొక్కలైతే విధ్వంసానికి గురయ్యాయో మళ్లీ ఆజాతి మొక్కలను పెంచేందుకు అధికారులు చర్యలు చేపట్టాలన్నారు. దేశంలో ఎప్పుడూ ఇలాంటి విపత్తు జరగలేదని, ఈవిషయాన్ని కేంద్ర హోంమంత్రి దృష్టికి తీసుకెళ్తానన్నారు. దట్టమైన అటవీ ప్రాంతంలో జరిగిన విపత్తును దేశం ఒక పాఠ్యాంశంగా తీసుకోవాలని అభిప్రాయం వ్యక్తంచేశారు. వరదల కారణంగా పేదలు, రైతులు నష్ట పోయిన వివరాలను అడిగి తెలుసు కోవడానికి ఈ ప్రాంతాన్ని సందర్శించడం జరిగింద ని అన్నారు. ఈటల వెంట మాజీ ఎంపీలు గరికపాటి మోహన్‌రావు, అజ్మీరా సీతారాంనాయక్, మాజీ ఎమ్మెల్యేలు ఆరూరి రమేష్, ధర్మారావు, బీజేపీ నియోజకవర్గ ఇన్‌చార్జి అజ్మీరా ప్రహ్లాద్, ములుగు జిల్లా అధ్యక్షుడు సిరికొండ బలరాం, నాయకులు బర్తపురం నరేష్, మల్లెల రాంబాబు, సలేందర్, పాపా రావు, సిద్దబోయిన సురేందర్, శ్రీకాంత్ పాల్గొన్నారు.

పొలాల్లో ఇసుక మేటలను ప్రభుత్వమే తొలగింపజేయాలి : ఈటల

గోవిందరావుపేట : భారీ వర్షాలు, వరదలతో నష్టపోయిన వారిని ఆదుకుంటామని ప్రభుత్వం ప్రకటన మాత్రమే చేసిందని, అధికారులతో క్షేత్రస్థాయిలో సమగ్ర సర్వే జరిపించి తక్షణమే సాయాన్ని అందజేయాలని, పొలాల్లో వేసిన ఇసుక మేటలను ప్రభుత్వమే తొలగింపజేయాలని బీజేపీ ఎంపీ ఈటల రాజేందర్ డిమాండ్ చేశారు. గోవిందరావుపేట మండలంలోని పస్రా శివారులో గుండ్లవాగు వరదకు దెబ్బతిన్న వరిపొలాలను పలువురు బీజేపీ నేతలతో కలిసి శుక్రవారం పరిశీలించారు. గతంలో గుండ్లవాగు ప్రాజెక్టుకు బుంగ పడటంతో కోతకు గురై, ఇసుక మేటలు వేసి వందలాది ఎకరాలు దెబ్బతిన్నాయని, రూ.5వేల నుంచి రూ.2 లక్షల వరకు ఖర్చుచేసి భూములను సాగుకు యోగ్యంగా మలుచుకుంటే వరదలతో మళ్లీ మేటలు వేశాయని, దీంతో రైతులు తీవ్ర వేదన చెందుతున్నారన్నారు. ఎకరానికి రూ.10 వేల నష్టపరిహారం ఇవ్వడంతోపాటు రాష్ట్రవ్యాప్తంగా ఇసుక మేటలు వేసి, కోతకు గురైన పొలాలను సాగుకు యోగ్యంగా మార్చేలా చర్యలు తీసుకోవాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. గుండ్లవాగుకు ఇరువైపులా కరకట్ట నిర్మించాలన్నారు. రాజకీయాలకు అతీతంగా వరద బాధితులను ఆదుకుంటామని తెలిపారు. ఆయన వెంట మాజీ రాజ్యసభ సభ్యుడు గరికపాటి మోహన్‌రావు, మాజీ ఎమ్మెల్యే మార్తినేని ధర్మారావు, మాజీ ఎంపీ అజ్మీరా సీతారాంనాయక్, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కాసం వెంకటేశ్వర్లు, జిల్లా అధ్యక్షుడు సిరికొండ బలరాం, నాయకులు చింతలపూడి భాస్కర్‌రెడ్డి, అజ్మీరా ప్రహ్లాద్, ఏనుగు రవీందర్‌రెడ్డి, జినుకుల కృష్ణాకర్‌రావు, శీలమంతుల రవీంద్రాచారి, భరతాపురం నరేష్, తక్కళ్లపల్లి దేవేందర్‌రావు, కొత్త సుధాకర్‌రెడ్డి, రుద్రారపు సురేష్, జాడి వెంకట్, నామవరపు విజయలక్ష్మి, కొత్త సురేందర్, నగరపు రమేష్, కర్ర సాంబశివరెడ్డి, చంద జ్యోతి, సత్యనారాయణ, తదితరులు పాల్గొన్నారు.



రైతుతో మాట్లాడుతున్న ఈటల రాజేందర్

ఉధృత గోదావరిని దాటలేక..

- తెలంగాణలో నిలిచిపోయిన మావోయిస్టులు
- ఈ క్రమంలోనే ఎన్‌కౌంటర్

హైదరాబాద్/చర్ల, సెప్టెంబరు 6(ఆంధ్రజ్యోతి): ఛత్తీస్‌గఢ్ దండకారణ్యంలో భద్రతా బలగాల నుంచి తప్పించుకునేందుకు తెలంగాణలోకి వచ్చిన మావోయిస్టులు.. ఇక్కడా గాలింపు తీవ్రం కావడంతో తిరిగివెళ్లే ప్రయత్నం చేశారు. కానీ.. గోదావరి ఉధృతి వారికి అడ్డుగా మారింది. ఫెర్రీ పాయింట్ల వద్ద పోలీస్ నిఘా, కూంబింగ్ ముమ్మరం చేయ టడంతో తప్పించుకునే మార్గం లేకపోయింది. భద్రాది కొత్తగూడెం జిల్లా కరకగూడెం అడవుల్లో జరిగిన ఎన్‌కౌంటర్‌లో హతమయ్యారు. ఛత్తీస్‌గఢ్‌లో బలగాల నుంచి తప్పించుకోవడంతో పాటు తెలంగాణలో పట్టు సాధిం చేందుకు వీరు వేసవిలో గోదావరి నది దాటి వచ్చారు. ఇప్పు డు అదే గోదావరిని అధిగమించలేక ప్రాణాలు కోల్పోయారు.

కాగా, గురువారం నాటి ఎన్‌కౌంటర్‌లో భద్రాద్రి కొత్తగూడెం-అల్లూరి సీతారామరాజు (బీకే-ఏఎస్ఆర్) డివిజన్ కమిటీ సభ్యులు ఆరుగురు మృతిచెందిన సంగతి తెలిసిందే. మణుగూరు లోకల్ గెరిల్లా స్క్వాడ్ (ఎల్జీఎస్) కార్యదర్శి వీరన్న అలియాస్ లచ్చన్న, ఆయన భార్య, మణుగూరు ఎల్జీఎస్ కమాండర్ పూనం లక్కె సహా మరో నలుగురు చనిపోయారు. లచ్చన్న నేతృత్వంలో దళం తెలంగాణలోకి మే నెలలోనే వచ్చింది. బలగాలకు చిక్కకుండా సంచరించింది. అయితే, తెలంగాణ పోలీస్‌లు వారి కదలికలను పక్కాగా పసిగట్టడంతో కరకగూడెం ఎన్‌కౌంటర్ జరిగింది. మరో టవైపు ఈ ఏడాది 6 నెలల్లో మావోయిస్టు ప్రభావిత రాష్ట్రాల్లో 100 మందిపైగా మృతి చెందారు. 300 మంది లొంగిపోయారు. 250 మంది వరకు అరెస్టయ్యారు. ఛత్తీస్‌గడ్‌లో కొంతకాలంగా భద్రతా బలగాలు 'ఆపరేషన్ కగార్' పేరుతో దాడులు చేస్తున్నాయి. ఇటు ఒడిసా, తెలంగాణ, ఏపీలోనూ కట్టుదిట్టం చేయడంతో మావోయిస్టులు తప్పించుకునే వీల్లేకపోతోంది. కేంద్ర హోం శాఖ ఆదేశాలతో అన్ని రాష్ట్రాల పోలీస్‌లు కూంబింగ్‌లతో మావోయిస్టుల స్థావరాలకు చేరువవుతుండడంతో అగ్ర నేతలు సురక్షిత స్థావరాల కోసం చూస్తున్నారు. నారాయణపూర్, బీజాపూర్, కాంకేర్ నుంచి కీలక నేతలు మహారాష్ట్ర, ఒడిశా, జార్ఖండ్‌తో పాటు తెలంగాణ వైపు వచ్చారన్న సమాచారంతో పోలీసులు గాలింపు ముమ్మరం చేశారు. కేంద్ర కమిటీలో చాలామంది వృద్ధాప్యం, అనారోగ్య సమస్యలతో ఇబ్బంది పడుతున్నారు.

ఇబ్బందికరంగా మారిన విభేదాలు

తెలుగు రాష్ట్రాలకు చెందిన నీల్సోను ఇన్‌ఫార్మర్ నెపంతో హతమార్చాక.. మావోయిస్టు పార్టీలో విబేదాలు తీవ్రమైనట్లు సమాచారం. దళంలో ఎవరు ఇన్‌ఫార్మర్, ఎవరు కాదు అన్న విషయంలో సందేహాలు నెలకొన్నాయి. రఘునాథపాలెం ఎన్‌కౌంటర్ సైతం ద్రోహులు ఇచ్చిన సమాచారంతోనే జరిగిందని పార్టీ ప్రకటించింది. తెలంగాణ- ఏపీ కేడర్‌లోనే కోవర్టులు ఎక్కువగా ఉన్నారన్న ప్రచారం ఉంది. అందుకే, వీరిని హిడ్మా తమ గ్రూప్‌తో దూరంగా ఉంచుతున్నారని తెలిసింది. కొద్ది రోజుల కిందట హిడ్మా బెటాలియన్ కేడర్లు కేంద్ర కమిటీ సభ్యుడైన చంద్రన్న టెంట్‌పై రాత్రివేళ దాడి చేసినట్లు సమాచారం. ఓవైపు పోలీసు క్యాంపులు, ఎన్‌కౌంటర్లు, మరోవైపు కేడర్ దూరం అవుతుండడం పార్టీని ఇరకాటంలో నెట్టేస్తున్నాయి.

విడిపోయి పట్టు కోల్పోయి..

విభేదాలు, ఎన్‌కౌంటర్లు, ఇతర పరిణామాలతో కొంత కాలంగా మావోయిస్టులు బృందాలుగా ఏర్పడి సంచరిస్తున్నారనే చర్చ సాగుతోంది. 30 నుంచి 50 మంది బృందాల్లో నేడు 10 మందే ఉంటున్నారు. ఈ క్రమంలోనే ఎన్‌కౌంటర్లకు చిక్కుతున్నారని తెలుస్తోంది. కరకగూడెంలో ఏడుగురు, బీజాపూర్, దంతెవాడలో 10-15 మంది సభ్యులే ఉండడం గమనార్హం. ఏప్రిల్‌లో కర్రి గుట్టలపై జరిగిన ఎన్‌కౌంటర్‌లో నలుగురు ఉన్నారు. మావోయిస్టులు జాగ్రత్తలు తీసుకోకపోవడంతోనే బలగాలకు చిక్కుతున్నట్లు చెబుతున్నారు. ఛత్తీస్‌గఢ్, తెలంగాణలో రెండు రోజుల్లో ఇద్దరు అగ్రనేతలు మృతి చెందారు. వీరిలో పార్టీలోని నాయకులు, సభ్యులకు దిశానిర్దేశం చేసే మొదటి తరం నాయకుడు రణదేవ్ దాదా ఉన్నారు. లచ్చన్న మృతి తెలంగాణలో మావోయిస్టు పార్టీకి కోలుకోని దెబ్బగా చెబుతున్నారు.

తెలంగాణలో అడుగుపెట్టనివ్వతం : డీజీపీ జితేందర్

తెలంగాణలో మావోయిస్టులను అడుగు పెట్టకుండా అన్ని జాగ్రత్తలు తీసుకుంటున్నామని డీజీపీ జితేందర్ తెలిపారు. జనజీవన స్రవంతిలో కలిసి అభివృద్ధిలో భాగస్వాములు కావాలని సూచించారు. గురువారం జరిగిన ఎన్‌కౌంటర్‌లో పెద్ద మొత్తంలో ఆయుధాలు స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు.

సీఎం.. ఉట్టి మాటలు కట్టిపెట్టు..

- వరద బాధితులకు ఆర్థిక సాయం అందించాలి
- ఎంపీ ఈటల రాజేందర్

మరిపెడ/మరిపెడ రూరల్, సెప్టెంబరు 6: సీఎం రేవంత్‌రెడ్డి ఉట్టి మాటలు కట్టిపెట్టి.. తక్షణమే వరద బాధితులకు ఆర్థిక సహాయం ఇవ్వాలని మల్కాజ్‌గిరి ఎంపీ ఈటల రాజేందర్ డిమాండ్ చేశారు. శుక్రవారం రాత్రి మహబూబాబాద్ జిల్లా మరిపెడ మండలం సీతారాంతండా ఆకేరు వరదబాధిత కుటుంబాలను ఆయన పరామర్శించి నిత్యావసర సరకులను అందచేశారు. ఈ సందర్భంగా విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ.. సీతారాంతండావాసులు అర్థరాత్రి ఉప్పెనలా వచ్చిన ఆకేరు వరదకు ఇళ్లుమునిగి సర్వం కోల్పోయారని, కట్టుబట్టలతో మిగిలిపోయారని ఆవేదన వ్యక్తం చేశారు. ముఖ్యమంత్రి స్వయంగా ఈ తండాకు వచ్చి బాధితులను పరామర్శించినప్పటికీ, ఒక్క రూపాయి ప్రభుత్వం నుంచి అందివ్వకపోవడం శోచనీయమన్నారు. వరద బాధితులను పరామర్శించి రేవంత్‌రెడ్డి ఉట్టిమాటలు చెప్పి వెళ్లారని ఆరోపించారు. ఇప్పటికైనా బాధితులకు పరిహారం ఇవ్వాలన్నారు. లేకుంటే ప్రజలు కాంగ్రెస్ ప్రభుత్వాన్ని క్షమించరన్నారు. మరిపెడ మండలంలోని భారీ వర్షానికి నష్టపోయిన బీచ్‌రాజ్‌పల్లి, ఉల్లేపల్లి, పురుషోత్తామాయగూడెం, బాల్నిధర్మారం, సీతారాం, భూక్యా తండాల ప్రజలకు బీజేపీ తరుపున ఆదుకుంటామని హామీ ఇచ్చారు. ఈటల వెంట జాతీయ ఎస్టీ కమిషన్ సభ్యుడు హుస్సేన్‌నాయక్, బీజేపీ క్రమశిక్షణ సంఘం రాష్ట్ర కన్వీనర్ మార్తినేని ధర్మరావు, మాజీ ఎంపీ సీతారాం నాయక్, జిల్లా పార్టీ అధ్యక్షుడు వైవీ రావు, స్థానిక నేతలు గంగాధర్, లింగంనాయక్, సుధాకర్, బాస్కర్, జనార్దన్ ఉన్నారు. అనంతరం మరిపెడలోని కార్గిల్ స్థూపం దగ్గర అమర జవాన్లకు నివాళులర్పించారు.



బాధిత కుటుంబాలను పరామర్శిస్తున్న ఈటల రాజేందర్

బొగత సందర్శన పునఃప్రారంభం

వాజేడు, సెప్టెంబరు 6: తెలంగాణ నయాగరా బొగత జలపాతం సందర్శనను శనివారం నుంచి పునఃప్రారంభిస్తున్నట్లు ఎఫ్ఆర్‌వో చంద్రమౌళి ఒక ప్రకటనలో తెలిపారు. గత నెల 31 నుంచి భారీ వర్షాల కారణంగా జలపాతం సందర్శనను ఫారెస్టు అధికారులు నిలిపివేశారు. ఈనేపథ్యంలో వర్షాలు తగ్గుముఖం పట్టడంతో తిరిగి పర్యాటకులను సందర్శనకు అనుమతిస్తున్నట్లు వెల్లడించారు. పర్యాటకులు ఈతకొలనులో దిగేందుకు అనుమతులు లేవని, కేవలం సందర్శనకు మాత్రమే అనుమతి స్తున్నట్లు ఆయన తెలిపారు. బొగత వద్ద ప్రమాదాలు జరిగే ఆస్కారం ఉండటంతో పర్యాటకులు అప్రమత్తంగా ఉండాలని సూచించారు.

మక్కలకు మస్తు గిరాకీ

ఏనుమాములలో క్వింటా రూ.3,015 పలికిన ధర

వరంగల్ వ్యవసాయం, సెప్టెంబరు 6: ఏనుమాముల వ్యవసాయ మార్కెట్లో మొక్కజొన్న (మక్క)లకు గిరాకీ పలుకుతుండడంతో రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. శుక్రవారం మార్కెట్లో మక్కలు క్వింటా ధర రూ.3015 పలికగా గతంలో ఇంత ధర ఎప్పుడూ పలకలేదని మార్కెట్ వర్గాలు పేర్కొంటున్నాయి. హనుమకొండ జిల్లా నడికుడ మండలం నర్సక్కపల్లి గ్రామానికి చెందిన సురావు కిషన్‌రావు 116 బస్తాల మక్కలు అమ్మకానికి తీసుకుని రాగా హెచ్‌జిఎల్ అడ్తి ద్వారా వెంకటరమణ ఎంటర్ ప్రైజెస్ క్వింటాకు రూ. 3,015 చొప్పున కొనుగోలు చేశారు. దీంతో రైతు కిషన్‌రావు హర్షం వ్యక్తం చేశారు. గతంలో మార్కెట్లో కనీస మద్దతు ధర కూడా పలకలేదని, కానీ ఇప్పుడు ఆశించిన దానికంటే అధికంగా వస్తోందని చెబుతున్నారు. రాష్ట్రంలో చికెన్ వినియోగం పెరిగిపోవడంతో కోళ్ల పెంపకం పెరిగిందని, కోళ్ల దాణా కోసం ఎక్కువగా మొక్కజొన్నలు వినియోగిస్తుండడంతో డిమాండ్ పెరిగిందని వ్యాపారులు పేర్కొంటున్నారు. అలాగే బిస్కెట్, మద్యం తయారీలో వాడకం, ఇతర ఆహార పదార్థాల తయారీలోనూ వినియోగం పెరుగడం ధరలు పెరుగడానికి కారణమని వ్యాపారులు తెలిపారు.



మార్కెట్‌కు మొక్కజొన్నలను అమ్మకానికి తీసుకువచ్చిన రైతు కిషన్‌రావు

మార్కెట్‌లో మక్కల ధరలు ఇలా..

ధర	2020-21	2021-22	2022-23	2023-24
గరిష్ఠ	రూ.1,895	రూ.2,551	రూ.2450	రూ.3015
కనిష్ఠ	రూ.1,285	రూ.1,285	రూ.1000	రూ.1221



ఆర్థిక ఇబ్బందులతో పురోహితుడి ఆత్మహత్య



మహేష్ (ఫైల్)

గిర్మాజిపేట, సెప్టెంబరు 6 : వరంగల్-చింతల్‌పల్లి రైల్వేస్టేషన్‌ల మధ్య జాన్‌పీరీలు రైల్వేగేటు సమీపంలో శుక్రవారం ఉదయం రైలుకిందపడి మహేష్ ఉపాధ్యాయ (40) ఆత్మహత్య చేసుకున్నట్లు వరంగల్ జీఆర్‌పీ సీఐ టి.సురేందర్ తెలిపారు. అండర్‌బ్రిడ్జి సమీపంలో ముందాడ భవన్ ప్రాంతంలో నివాసం ఉంటున్న మహేష్‌కు భార్య గాయత్రి, ఇద్దరు కూతుర్లు. మర్వాడి పురోహితుడుగా మహేష్ జీవనం సాగిస్తున్నట్లు సీఐ తెలిపారు. ఆర్థిక ఇబ్బందులతో మహేష్ శుక్రవారం ఉదయం పౌరోహిత్యానికి వెళ్తున్నట్టు ఇంట్లో చెప్పి ఆత్మహత్య చేసుకున్నట్లు సీఐ తెలిపారు. మృతుడి వద్ద లభించిన ఆధారాలతో మహేష్‌గా గుర్తించి ఎంజీఎం మార్చురిలో పోస్టుమార్టం అనంతరం మృతదేహాన్ని కుటుంబసభ్యులకు అప్పగించి హెడ్‌కానిస్టేబుల్ జి.సుదర్శన్ కేసు దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.



గురువుతో మాట్లాడుతున్న కడియం శ్రీహరి

గురువును కలిసిన కడియం

పర్వతగిరి, సెప్టెంబరు 6 : ఉపాధ్యాయ దినోత్సవాన్ని పురస్కరించుకుని తనకు చిన్నప్పుడు అక్షరాభ్యాసం చేసిన గురువును రాష్ట్ర మాజీ ఉప ముఖ్యమంత్రి, స్టేషన్ ఘన్‌పూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి శుక్రవారం కలిశారు. తన స్వగ్రామమైన పర్వతగిరి మండల కేంద్రంలో తన చిన్నతనంలో చదువు నేర్పించిన గురువు బొంపెల్లి రంగారావును కలిసి మాట్లాడి చిన్ననాటి జ్ఞాపకాలను గుర్తుచేసుకున్నారు. ఆయన ఆరోగ్యం గురించి వాకబు చేశారు. తన గురువును గురుపూజోత్సవం రోజు కలుసుకోవడం సంతోషంగా ఉందని శ్రీహరి వ్యాఖ్యానించారు.

డ్రైనేజీ పనుల పరిశీలన



డ్రైనేజీ పనులను పరిశీలించిన కార్పొరేటర్

గిర్మాజిపేట, సెప్టెంబరు 6 : నగరంలోని శ్రీకృష్ణకాలనీ ప్రభుత్వ హైస్కూల్, బాలికల జూనియర్ కళాశాలలో ప్రభుత్వ ప్రత్యేక నిధులు రూ.5 లక్షలతో చేపట్టిన అత్యవసర డ్రైనేజీ పనులను శుక్ర వారం కార్పొరేటర్ చింతాకుల అనిల్‌కు మార్ పరిశీలించారు. ఇటీవల కురిసిన భారీ వర్షాలతో జలసంద్రంగా మారిన కాలేజీని సందర్శించిన మాజీ ఎమ్మెల్సీ కొండా మురళీధర్‌రావు స్పందించి అత్యవసర ప్రత్యేక నిధులను మంజూరు చేయించారు. ఈ నిధులతో వరంగల్ మహానగర పాలక సంస్థ ఇంజనీరింగ్ అధికారులు శుక్రవారం డ్రైనేజీ పనులు చేపట్టారు.

ముగిసిన హ్యాండ్ ఆన్ వర్క్‌షాపు



శిక్షణలో ప్రతిభ కనబరిచిన విద్యార్థులు

శంభునిపేట, సెప్టెంబరు 6 : నగరంలోని బొల్లికుంట వాగ్దేవి కాలేజ్ ఆఫ్ ఇంజనీరింగ్‌లోని ఇండస్ట్రీ ఇనిస్టిట్యూట్ ఇంటరాక్షన్ సెల్ సహకారంతో గత మూడు రోజులుగా నిర్వహిస్తున్న హ్యాండ్ ఆఫ్ వర్క్ షాపు శుక్రవారం ముగిసింది. ముగింపు కార్యక్రమానికి హైదరాబాద్‌లోని రాపిడ్ టెక్నాలజీకి చెందిన సీనియర్ డెవలపర్ కేర్ల రాజు పాల్గొన్నారు. ప్రోగ్రామ్స్‌లోని గిట్‌హబ్, ఆర్టిఫిషియల్ ఇంటలిజెన్స్, చాట్ జీపీటీ అంశాల పై విద్యార్థులకు సాంకేతిక మెళకువలు నేర్పించారు. కార్యక్రమంలో ప్రోగ్రాం కన్వీనర్, కళాశాల సీఎస్‌డీ హెచ్‌ఓడీ డాక్టర్ ఐషాబాను, జరీనా బేగం, లక్ష్మీ, లలిత కంప్యూటర్ సైన్స్ నిపుణులు, విద్యార్థులు పాల్గొన్నారు.

మహిళలకు రక్షణగా షీ టీం

కాశిబుగ్గ, సెప్టెంబరు 6: మహిళలకు రక్షణగా షీ టీంలు పనిచేస్తున్నాయని షీ టీం హెడ్ కానిస్టేబుల్ సూర్యనారాయణ తెలిపారు. షీ టీం ఆధ్వర్యంలో శుక్రవారం కాశిబుగ్గ శ్రీ భార్గవి హై స్కూల్‌లో నేరాలపై అవగాహన, తీసుకోవాల్సిన జాగ్రత్తలను విద్యార్థులకు వివరించారు. సోషల్ మీడియాలో వ్యక్తి గత ఫొటోలు, వీడియోలు పంచుకోవడంలో జాగ్రత్తగా వ్యవహరించాలని సూచించారు. కార్యక్రమంలో భార్గవి స్కూల్ చైర్మన్ ఆవుల శ్రీనివాస్, ప్రిన్సిపాల్ సువర్ణ, దీపక్, మాధవి, బ్రహ్మేంద్ర, సంతోష్, కానిస్టేబుల్ వంశీకృష్ణ పాల్గొన్నారు.

కూలిన ఇళ్ల పరిశీలన



కూలిన ఇళ్లను పరిశీలిస్తున్న కార్పొరేటర్

ఖిలావరంగల్, సెప్టెంబరు 6: ఇటీవల వర్షాలకు కూలిన ఇళ్లను కార్పొరేటర్ వస్కుల బాబు, వరంగల్ మండలం రెవెన్యూ అధికారి (ఆర్ఐ) కృష్ణస్వామిలు పరిశీలించారు. శుక్రవారం క్రిస్టియన్‌కాలనీలోని పొలెపాక జ్యోతి, ప్రసాద్, సువర్ణ, అయిత అనిల్, వస్కుల విమల తదితరుల ఇళ్లను పరిశీలించారు. కార్పొరేటర్ బాబు మాట్లాడుతూ బాధిత కుటుంబాలకు ప్రభుత్వం డబుల్ బెడ్‌రూం ఇల్లు ఇవ్వాలని కోరారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు సందెల లాజర్, పొలెపాక భాస్కర్, చందు, కొల్లూరి కిరణ్, పాల్గొన్నారు.

ఫోర్జరీ కేసులో ఒకరి అరెస్టు

మట్టెవాడ, సెప్టెంబరు 6: వరంగల్ తహసీల్దార్ కార్యాలయంలో కుటుంబ సభ్యుల ధ్రువీకరణ పత్రాలు, నకిలీ పట్టాలకు సంబంధించి తహసీల్దార్ సంతకం ఫోర్జరీ కేసులో నిందితుడు మాన్యం సిద్దయ్యను అరెస్టు చేసినట్లు శుక్రవారం మట్టెవాడ ఎస్ఐ జి.సాంబయ్య తెలిపారు. కాశిబుగ్గకు సిద్దయ్య కొన్ని సంవత్సరాలుగా వరంగల్ తహసీల్దార్ కార్యాలయంలో అధికారుల ఫోర్జరీ సంతకాలు చేసి తప్పుడు సర్టిఫికేట్లను జారీ చేసేవాడని తెలిపారు. ఇటీవల ఫోర్జరీ కేసుకు సంబంధించి దర్యాప్తులో భాగంగా శుక్రవారం సిద్దయ్యను అరెస్టు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

సట్టా బెట్టింగ్‌పై టాస్క్‌ఫోర్స్ దాడులు

వర్ధన్నపేట రూరల్, సెప్టెంబరు 6: సట్టా, మట్కా బెట్టింగ్‌పై టాస్క్‌ఫోర్స్ సివిల్ పోలీసులు మెరుపు దాడి చేసిన ఘటన మండలంలోని నల్లబెల్లిలో శుక్రవారం రాత్రి చోటుచేసుకుంది. వర్ధన్నపేట పోలీసుల కథనం ప్రకారం... వరంగల్ ఉర్సు కరీమాబాద్‌కు చెందిన ఎండీ.యాకూబ్, ఎండీ.అన్వర్ అనే వ్యక్తులు ఆన్‌లైన్‌లో సట్టా, మట్కా ద్వారా డబ్బులు సంపాదించవచ్చని గ్రామీణ ప్రాంత ప్రజలను నమ్మించి, కొందరు వ్యక్తులతో గ్రామంలో బెట్టింగ్ పెట్టిస్తుండగా విశ్వసనీయ సమాచారం మేరకు, సమాచారం తెలుసుకుని పోలీసులు దాడులు చేయగా వారు పట్టుబడ్డారు. వారి నుంచి రూ.33,150, రెండు సెల్ ఫోన్లు స్వాధీనం చేసుకున్నారు. ఇద్దరిపై కేసు నమోదు చేసినట్లు వర్ధన్నపేట ఎస్ఐ ప్రవీణ్‌కుమార్ తెలిపారు. ఈ దాడుల్లో టాస్క్‌ఫోర్స్ ఏసీపీ మధుసూదన్, సీఐ పవన్ కుమార్ పాల్గొన్నారు.

చిన్నారి అదృశ్యం



మద్దెల సహశ్రీత

కరీమాబాద్, సెప్టెంబరు 6: శివనగర్‌లో అదృశ్యమైన ఘటన శుక్రవారం చోటు చేసుకుంది. మిల్స్‌కాలనీ పోలీసుల కథనం ప్రకారం. శివనగర్‌కు చెందిన మద్దెల నవీన్ ఎనిమిదేళ్ల కూతురు మద్దెల సహశ్రీత శివనగర్‌లోని ప్రకాశ్ మెమోరియల్ స్కూల్‌లో చదువుకుంటుంది. శుక్రవారం రోజులాగే స్కూల్‌కు వెళ్లిన చిన్నారి సాయంత్రం స్కూల్ నుంచి బయటకు వచ్చి తప్పిపోయింది. చిన్నారి ఆచూకీ తెలిసిన వారు మిల్స్‌కాలనీ పోలీస్ స్టేషన్‌లో అప్పగించాలని ఎస్ఐ సురేష్ కోరారు.



వరంగల్ హెడ్ పోస్టాఫీస్ వద్ద..

జైజై గణేశా..

గణపతి నవరాత్రి సందర్భంగా వరంగల్‌లోని ఎంజీఎం సెంటర్ వద్ద కొనుగోలు చేసిన వినాయకులను శుక్రవారం నిర్వాహకులు మండపాలకు తరలించారు. ఈ సందర్భంగా రోజంతా అక్కడ సందడి నెలకొంది. పూజా సామగ్రి అలాగే వరంగల్ హెడ్‌పోస్టాఫీస్ వద్ద పూల విక్రయాలు జోరుగా సాగాయి.

రావయ్యా.. గణపయ్యా..

నేటి నుంచి గణపతి నవరాత్రి ఉత్సవాలు

వరంగల్ కల్చరల్, సెప్టెంబరు 6: వినాయక చవితిని ఉత్సవాలకు జిల్లా వ్యాప్తంగా ఘనంగా ఏర్పాట్లు చేశారు. గణపతి నవరాత్రి ఉత్సవాలను శనివారం నుంచి ఆరంభం కానున్నాయి. గణనాథులను ప్రతిష్ఠించేందుకు మండపాల నిర్వాహకులు సర్వం సిద్ధం చేశారు. మండపాలను సర్వాంగ సుందరంగా తీర్చిదిద్దారు. విద్యుత్ అలంకరణలో మెరిసిపోతున్నాయి. ఆలయాలతోపాటు, వాడవాడలా గణపతి మండపాలను ఏర్పాటు చేశారు. తొమ్మిది రోజుల పాటు నిర్వహించే గణపతి నవరాత్రి ఉత్సవాల నిర్వాహకులకు పోలీసుల నుంచి అనుమతి తప్పనిసరిగా తీసుకోవాలి. ఈ సందర్భంగా మండపాల వద్ద నిర్వహణ ఎలా ఉండాలనేది పోలీసులు ఒక గైడ్ లైన్ ప్రకారం సూచిస్తున్నారు. నిర్వాహకులు ఆధార్ కార్డులు, వివరాలు ఫోన్ నంబర్లతో పోలీసు అధికారులకు దరఖాస్తు తీసుకొని అనుమతి తీసుకోవాలి.

భక్తి శ్రద్ధలతో పండుగ జరుపుకోవాలి: మంత్రి సురేఖ

హిందూ ధార్మిక ఆధ్యాత్మిక ప్రపంచానికి గణేష్‌డు ప్రథమ పూజ్యుడని, సకల శాస్త్రాలకు అధిపతిగా ఆటంకాలను తొలగించే విఘ్నేశ్వరుడిగా, బుద్ధికి జ్ఞానానికి ఆరాధ్యుడిగా ఉన్న గణపతి నవరాత్రి ఉత్సవాలు వినాయక చవితి పర్వదినాన్ని భక్తి శ్రద్ధలతో జరుపుకోవాలని రాష్ట్ర దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ ఒక ప్రకటనలో కోరారు. సీఎం రేవంత్‌రెడ్డి ఆదేశాల మేరకు ఈ సంవత్సరం వినాయక మండపాలకు ప్రభుత్వం ఉచిత విద్యుత్ అందిస్తున్నట్లు మంత్రి సురేఖ తెలిపారు. ప్రభుత్వ మార్గదర్శకాలను అనుసరించి ఉత్సవ కమిటీలు మండపాల నిర్వాహకులు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని సూచించారు. ప్రజలంతా సుఖసంతోషాలతో ఉండాలని మంత్రి ఆకాంక్షించారు.

మండపాలకు తరలుతున్న విగ్రహాలు

గణపతి నవరాత్రి ఉత్సవాలకు శనివారం నుంచి ప్రారంభం కానున్న నేపథ్యంలో వినాయక విగ్రహాలను కొనుగోలు కేంద్రాల నుంచి నిర్వాహకులు మండపాలకు తరలిస్తున్నారు. రెండు రోజులుగా ఈ ప్రక్రియ సాగుతుండడంతో నగర వీధులు వినాయకుల తరలింపుతో సందడిగా మారాయి. మండపాలకు తొలిసారిగా రాష్ట్ర ప్రభుత్వం ఉచిత విద్యుత్ అందిస్తుందని సీఎం రేవంత్‌రెడ్డి ప్రకటించిన నేపథ్యంలో మండపాలకు ఉచితంగా విద్యుత్‌ను సిబ్బంది అందించనున్నారు.

పూజా సామగ్రి కొనుగోలుతో మార్కెట్లు కిటకిట

వినాయక చవితి పర్వదినం సందర్భంగా పూజా సామగ్రి కొనుగోలుతో మార్కెట్లు కిటకిటలాడాయి. సిద్ధమైన 18రకాల పత్రులు కంకులు, వెలగపండు, మారేడుకాయ, గన్నేరు పూలు, పండ్లు, లిల్లీపూలు, చెరుకు గడలు, మామిడాకు, అరటి చెట్లు వివిధ సామగ్రిని అమ్మకందారులతో వరంగల్ నగరంలోని రహదారులన్నీ కొనుగోలుదారులతో రద్దీగా మారాయి. స్టేషన్‌రోడ్డు, పోస్టాఫీస్ సెంటర్, అండర్‌బ్రిడ్జి, హంటర్ రోడ్డు, వరంగల్ చౌరస్తా, జేపీఎన్‌రోడ్డు, మండిబజార్, పోచమ్మ మైదాన్, బట్టల బజార్, చెమన్, ఎంజీఎం సెంటర్, వెంకట్రామ జంక్షన్, కాశిబుగ్గ జంక్షన్, రంగశాయిపేట, లేబర్ కాలనీ జంక్షన్ ప్రాంతాల్లో పూజ సామగ్రి విక్రయాలతో సందడిగామారాయి.

పూలు, పండ్లకు భలే గిరాకీ..

పండుగను పురస్కరించి చామంతి, బంతి, గులాబీ, లిల్లీ, వివిధ రకాల పూలు ధరలు అధికంగా పలికాయి. కిలో రూ. 400 నుంచి 600 వరకు పలికాయి. కాగడాల మల్లె పూలు కిలో వెయ్యి, పండ్లు, సేపులు, ధానిమ్మ, బతాయితో పాటు అరటి పండ్లు డజన్ రూ. 80 పలుకుతున్నాయి. కొబ్బరి కాయల అమ్మకాలు జోరుగా సాగుతున్నాయి.

మట్టి వినాయకులనే పూజించాలి: కలెక్టర్



మట్టి వినాయకులను పంపిణీ చేస్తున్న కలెక్టర్

వరంగల్ కలెక్టరేట్, సెప్టెంబరు 6: పర్యావరణాన్ని పరిరక్షించేందుకు మట్టి వినాయకులనే పూజించాలని కలెక్టర్ సత్యశారద పిలుపునిచ్చారు. శుక్రవారం కలెక్టరేట్ ప్రాంగణంలో రాష్ట్ర కాలుష్య నియంత్రణ మండలి ఆధ్వర్యంలో ఈఈ సునీతతో కలిసి కలెక్టర్ మట్టి వినాయక ప్రతిమలను పంపిణీ చేశారు. కలెక్టర్ మాట్లాడుతూ మట్టి విగ్రహాలతో తయారు చేసిన గణపతులనే పూజించాలనే ఉద్దేశంతో ప్రభుత్వ పరంగా చేపడుతున్న కార్యక్రమం విజయవంతం చేయాలని కోరారు. పొల్యూషన్ కంట్రోల్‌బోర్డు ఆధ్వర్యంలో వరంగల్ జిల్లాకు 2వేల మట్టి విగ్రహాలు సరఫరా చేయడం జరిగిందని, వివిధ ప్రాంతాల్లోని ప్రజలకు మట్టి వినాయక విగ్రహాలను సరఫరా చేసేలా చర్యలు తీసుకుంటున్నామన్నారు. వివిధ రకాల రసాయనాలు, ప్లాస్టర్ ఆఫ్ పారిస్‌తో తయారు చేసే విగ్రహాల వల్ల ఏర్పడిన కాలుష్యంతో పర్యావరణానికి ముప్పు వాటిల్లే ప్రమాదం ఉందని కలెక్టర్ తెలిపారు.

మట్టి వినాయకుల పంపిణీ

శంభునిపేట, సెప్టెంబరు 6: మట్టి గణనాథులను ప్రతిష్ఠించి పర్యావరణ పరిరక్షణలో భాగస్వాములవ్వాలని కాంగ్రెస్ నాయకులు గోపాల నవీన్‌రాజ్, 42వ డివిజన్ కార్పొరేటర్ గుండు చందనపూర్ణచందర్‌లు కోరా రు. శుక్రవారం మట్టి గణనాథుల పంపిణీ రంగశాయిపేటలోని మహిళా స్వశక్తి భవన్‌లో నిర్వహించారు. కార్పొరేటర్ గుండు అధ్యక్షతన జరిగిన కార్యక్రమానికి నవీన్‌రాజ్ ముఖ్యఅతిథిగా విచ్చేసి 1500 మట్టి వినాయకులను ఉచితంగా పంపిణీ చేశారు. కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్, పీఏసీఎస్ చైర్మన్ కేడల పద్మజనార్దన్, డివిజన్ అధ్యక్షులు ఎలుగు సాంబేషం, మెప్మా సీఓ ప్రవీణ్, ముత్తినేని రామ్మూర్తి, దామెరకొండ కర్ణాకర్, వలుప దాసు కృష్ణ, ఎమ్డీ బషీర్ తదితరులు పాల్గొన్నారు.

●గిర్మాజిపేట: 27వ డివిజన్ కార్పొరేటర్ చింతాకుల అనిల్ కుమార్ శుక్ర వారం గోవిందరాజుల గుట్ట ప్రాంగణంలో మట్టి గణపతి విగ్రహాలను పం పిణీ చేశారు. ఆయన మాట్లాడుతూ పర్యావరణానికి హాని కలిగించే విగ్రహాలకు బదులుగా మట్టి విగ్రహాలను పూజించాలని కోరారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు కొమ్ము శ్రీధర్, చెమ్మల సాగర్ పాల్గొన్నారు.

● కాశిబుగ్గ: వినాయక చవితి పండగ సందర్భంగా కాంగ్రెస్ నేతలు ఉచితంగా మట్టి గణపతులను పంపిణీ చేశారు. టీపీసీసీ కార్యదర్శి మీసాల ప్రకాష్ ఆధ్వర్యంలో కనకదుర్గ దేవాలయం వద్ద పంపిణీ చేశారు. కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ జారతి రమేష్, కాంగ్రెస్ నేతలు సందెల రాజు, ప్రభాకర్, వేణు, శ్రీనివాస్, విశాల్, రామకృష్ణ, జస్వీర్ సింగ్, సదానందం, యాకుబ్, శ్యామల, రాజేందర్, లావణ్య, సరళాదేవి పాల్గొన్నారు.

● ఖిలావరంగల్: నగరంలోని 34, 35, 37 డివిజన్‌లలో కాంగ్రెస్ నాయ కులు పంపణీ చేశారు. శివనగర్‌లో పగడాల సతీష్, లావణ్యల సంయుక్త ఆధ్వర్యంలో కాంగ్రెస్ లీగల్ సెల్, పార్టీ చైర్మన్ శామంతుల శ్రీనివాస్ పం పిణీ చేశారు. శివనగర్‌లో కార్పొరేటర్ సోమిశెట్టి ప్రవీణ్ మట్టి వినాయ కులను పంపిణీ చేశారు. తూర్పుకోటలో కార్పొరేటర్ వెల్పుగొండ సువర మట్టి వినాయకులను పంపిణీ చేశారు. కార్యక్రమంలో టీపీసీసీ కార్యదర్శి కొత్తపెల్లి శ్రీనివాస్, డివిజన్ అధ్యక్షులు రేణికుంట్ల శివ, బోయిని దూడ య్య, కాంగ్రెస్ నాయకులు సారా సాంబయ్య పాల్గొన్నారు. ఖమ్మరోడ్‌వద్ద గల లిటిల్ మాస్టర్ ఉన్నత పాఠశాల విద్యార్థులు శుక్రవారం ప్రదర్శన, ర్యాలీ చేశారు. అనంతరం మట్టి వినాయకులను పంపిణీ చేశారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ శరత్‌బాబు పాల్గొన్నారు.



రంగశాయిపేటలో మట్టి వినాయకులను పంపిణీ చేస్తున్న నాయకులు

● కరీమాబాద్: నగరంలోని 40వ డివిజన్ కార్పొరేటర్ మరుపల్ల రవి గ్రేటర్ వరంగల్ మున్సిపల్ కార్పొరేషన్ ఆధ్వర్యంలో అందించిన మట్టి గణనాథులను శుక్రవారం ప్రజలకు అందించారు. కార్యక్రమంలో పూజారి విజయ్, మరుపల్ల గౌతమ్, పోలేపాక రాజన్‌బాబు, మహేష్ పాల్గొన్నారు.

ఆటోనగర్: నగరంలోని 21వ డివిజన్ కార్పొరేటర్ మహమ్మద్ ఫుర్ఖాన్ డివిజన్‌లో మట్టి వినాయక విగ్రహాలను పంపిణీ చేశారు. కార్పొరేటర్ మాట్లాడుతూ పర్యావరణహితంగా పండుగను జరుపుకోవాలని కోరారు.



మట్టి వినాయకులతో ప్రదర్శన, ర్యాలీ నిర్వహిస్తున్న ప్రైవేట్ స్కూల్ విద్యార్థులు



కనకదుర్గ దేవాలయం వద్ద మట్టి గణపతులను పంపిణీ చేస్తున్న కాంగ్రెస్ నేతలు



21 డివిజన్‌లో విగ్రహాలను పంపిణీ చేస్తున్న కార్పొరేటర్ ఫుర్ఖాన్

ఉత్తమ అవార్డు గ్రహీతలకు సన్మానం: డీఐఈవో



రాష్ట్ర ఉత్తమ లెక్చరర్లను అభినందిస్తున్న డీఐఈవో శ్రీధర్‌సుమన్

వరంగల్ ఎడ్యుకేషన్, సెప్టెంబరు 6: జాతీయ ఉపాధ్యాయ దినోత్సవాన్ని పురస్కరించుకొని రాష్ట్ర స్థాయిలో ఉత్తములుగా సత్కారం పొందిన జిల్లాలోని వివిధ జూనియర్ కళాశాలల ప్రిన్సిపాళ్లు, లెక్చరర్లను డీఐఈవో డాక్టర్ జి. శ్రీధర్ సుమన్ అభినందించారు. శుక్రవారం హనుమకొండలోని డీఐఈవో కార్యాలయంలో ఉత్తములైన నర్సంపేట ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ పి.సంపత్‌కుమార్, వర్ధన్నపేట ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ జి.వెంకటయ్య, నర్సంపేట జూనియర్ కళాశాల హిందీ జూనియర్ లెక్చరర్ డాక్టర్ ఎల్.కొమురారెడ్డిని డీఐఈవో శాలువా, పుష్పగుచ్ఛాలతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

న్యాస్ ఫలితాల్లో జిల్లాను ముందంజలో నిలపాలి



కార్యక్రమంలో మాట్లాడుతున్న డీఈవో జ్ఞానేశ్వర్

వరంగల్ ఎడ్యుకేషన్, సెప్టెంబరు 6: న్యాస్‌లో మెరుగైన ఫలితాలను సాధించి వరంగల్ జిల్లాను ముందంజలో నిలుపాలని డీఈవో మామిడి జ్ఞానేశ్వర్ కోరారు. శుక్రవారం ఖమ్మం బైపాస్‌రోడ్‌లోని బిర్లా ఓపెన్ మైండ్స్ స్కూల్లో ఎంఈవోలు, నోడల్ ఆఫీసర్లు, హెడ్మాస్టర్లు, ఎస్‌వోలకు ఒక్కరోజు శిక్షణ కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా డీఈవో జ్ఞానేశ్వర్ మాట్లాడుతూ... ఎఫ్‌ఎల్‌ఎన్, లిప్ కార్యక్రమాలను పటిష్ఠంగా నిర్వహించాలన్నారు. ప్రతీ విద్యార్థిపై వ్యక్తిగత శ్రద్ధ పెడుతూ వారిలో అభ్యసన సామర్థ్యాలను పెంపొందించేలా ఉపాధ్యాయులందరూ కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో ఎస్‌వోలు సుజన్‌తేజ, ఫ్లోరెన్స్, సుభాష్, ఎంఈవోలు విజయ్‌కుమార్, రంగయ్య, రత్నమాల, సత్యనారాయణ తదతరులు పాల్గొన్నారు.

గాయపడిన కానిస్టేబుల్ మృతి

శంభునిపేట, సెప్టెంబరు 6: రోడ్డు ప్రమాదంలో గాయాలపాలైన హెడ్ కానిస్టేబుల్ చికిత్స పొందుతూ గురువారం అర్ధరాత్రి మృతిచెందాడు. మామునూరు టీజీఎస్పీ ఫోర్త్ బెటాలియన్‌లో హెడ్ కానిస్టేబుల్‌గా పనిచేస్తున్న గుగులోతు బాలాజీ (52) ఆగస్టు 14న విధులకు హాజరయ్యేందుకు నాయుడు పెట్రోల్ పంపు వద్ద గల తన ఇంటి నుంచి బెటాలియన్‌కు బయలుదేరాడు. బెటాలియన్ గేటు వద్ద రోడ్డు క్రాస్ చేస్తుండగా వేగంగా దూసుకొచ్చిన ఇసుక ట్రాక్టర్ బైక్‌ను ఢీకొట్టింది. అక్కడే విధులు నిర్వహిస్తున్న సిబ్బంది గాయాల పాలైన బాలాజీని హుటాహుటిన సికింద్రాబాద్‌లోని ఓ ప్రైవేటు ఆస్పత్రికి తరలించారు. ఆరోగ్యం విషమించి గురువారం మృతి చెందినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. శుక్రవారం జరిగిన అంత్యక్రియల్లో బెటాలియన్ కమాండెంట్ బి.ప్రకాశ్, అధికారులు, సిబ్బంది పాల్గొని నివాళులర్పించారు.

జువైనల్ హోమ్‌కు మైనర్

మట్టెవాడ, సెప్టెంబరు 6: వరంగల్ ట్రాఫిక్ పోలీసు స్టేషన్ పరిధిలో బాలుడు ట్రాఫిక్ పోలీసులకు పట్టుబడ్డాడు. నిబంధనలకు విరుద్ధంగా డ్రైవింగ్ చేస్తున్న 8మంది బాలురపై జువైనల్ చార్జీషీటు ఫైల్ చేసి శుక్రవారం జువేనల్ కోర్టులోని మెజిస్ట్రేట్ ముందు హాజరుపరిచారు. అందులో ఒక బాలుడికి ఒక రోజు బాలల అబ్జర్వేషన్ హోమ్‌కు తరలించాలని మెజిస్ట్రేట్ ఆదేశించినట్లు వరంగల్ ట్రాఫిక్ సీఐ రామకృష్ణ తెలిపారు.

21 మందికి జరిమానా..

మద్యం తాగి వాహనం నడిపిన కేసులో 21 మంది వాహనదారులకు వరంగల్ కోర్టు సెకెండ్ క్లాస్ మెజిస్ట్రేట్ గుర్రపు వీరస్వామి రూ. 30,600 జరిమానా విధించినట్లు వరంగల్ ట్రాఫిక్ సీఐ రామకృష్ణ తెలిపారు. డ్రైవింగ్ లైసెన్స్ లేకుండా వాహనాలు నడిపిన 7 మంది వాహనదారులకు మెజిస్ట్రేట్ రూ. 6500 జరిమానా విధించినట్లు తెలిపారు.





గురువుతో మాట్లాడుతున్న కడియం శ్రీహరి

గురువును కలిసిన కడియం

పర్వతగిరి, సెప్టెంబరు 6 : ఉపాధ్యాయ దినోత్సవాన్ని పురస్కరించుకుని తనకు చిన్నప్పుడు అక్షరాభ్యాసం చేసిన గురువును మాజీ ఉపముఖ్యమంత్రి, స్టేషన్ ఘన్‌పూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి శుక్రవారం కలిశారు. తన స్వగ్రామమైన పర్వతగిరి మండల కేంద్రంలో తన చిన్నతనంలో చదువు నేర్పించిన గురువు బొంపెల్లి రంగారావును కలిసి మాట్లాడి చిన్ననాటి జ్ఞాపకాలను గుర్తు చేసుకున్నారు. ఆయన ఆరోగ్యం గురించి వాకబు చేశారు. గురుపూజోత్సవం సందర్భంగా కలుసుకోవడం సంతోషంగా ఉందని శ్రీహరి వ్యాఖ్యానించారు.

ప్రభుత్వ ఆస్పత్రిని సందర్శించిన ఎంపీ కావ్య



ఆస్పత్రి సందర్శనలో ఎంపీ కావ్య

వర్ధన్నపేట, సెప్టెంబర్ 6 : వర్ధన్నపేట పట్టణ కేంద్రంలోని ప్రభుత్వ ఆస్పత్రిని వరంగల్ ఎంపీ కడియం కావ్య శుక్రవారం సందర్శించారు. ఆస్పత్రిలోని రోగులను పరామర్శించి వారి బాగోగులను అడిగి తెలుసుకున్నారు.ఆస్పత్రిలో పేషంట్లకు మెరుగైన వైద్య సేవలు అందేంచేందుకు ప్రభుత్వం ఎల్లవేళలా వైద్యులను అందుబాటులో ఉండే విధంగా చర్యలు తీసుకుంటుందని ఆస్పత్రిలోని రోగులకు భరోసా కల్పించారు. రోగులకు అందిస్తున్న వైద్యసేవలను ఆస్పత్రి సూపరింటెండెంట్‌ను అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఎంపీ కావ్య మాట్లాడూతూ గతంలో తాను వైద్యురాలిగా ఇదే ఆస్పత్రిలో సేవలందించి ఎంపీగా అవకాశం రావడంతో ఎన్నికల బరిలో నిలిచి ఎంపీగా గెలుపొందడం చాలా సంతోషంగా ఉందన్నారు. పేదలకు నాణ్యమైన వైద్య సేవలు అందించేందుకు కాంగ్రెస్ ప్రభుత్వ ఆస్పత్రుల్లో అధునాతన సేవలను అందుబాటులోకి తీసుకొచ్చిందన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం పేదలకు ఎల్లప్పుడు అందుబాటులో ఉండే ప్రభుత్వమని అన్నారు.

మృతురాలి కుటుంబానికి పరామర్శ

వర్ధన్నపేట పటణ శివారు కోనాపురం గ్రామానికి చెందిన ఎలికట్టే భాస్కర్, భార్య ఎలికట్టే స్వరూప ఇటీవల మృతి చెందారు. దీంతో వారి నాలుగేళ్ల కుమార్తె అనాథగా మారింది. ఈ సమాచారం తెలుసుకున్న ఎంపీ కావ్య వారి బంధువులను పరామర్శించి ఆర్థిక సాయం అందించారు. ఈ చిన్నారిపాప సంరక్షణ కోసం ఐసీడీఎస్ అధికారులతో మాట్లాడి పాప బాధ్యతను ప్రభుత్వమే చూసుకునే విధంగా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఎంపీ వెంట మునిసిపల్ చైర్‌పర్సన్ ఆంగోత్ అరుణ, ఘైన సురేష్, చిటూరి రాజు, సిలువేరు శ్రీధర్, పులి శ్రీనివాస్, తుమ్మల రవీందర్, సమ్మెట సుధీర్, అన్వర్ తదితరులు ఉన్నారు.

ఎంపీ ఈటలకు స్వాగతం ఘన స్వాగతం



ఎంపీ రాజేందర్‌తో మాట్లాడుతున్న బీజేపీ నాయకులు

నర్సంపేట, సెప్టెంబరు 6 : మల్కాజిగిరి ఎంపీ ఈటల రాజేందర్‌కు నర్సంపేటలో శుక్రవారం బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి గోగుల రాణా ప్రతాప్‌రెడ్డి ఆధ్వర్యంలో ఆ పార్టీ నాయకులు ఘనస్వాగతం పలికారు. వరద బాధితులను పరామర్శించడానికి ములుగు పర్యటను ముగించుకొని మహబూబాబాద్‌కు వెళ్తున్న రాజేందర్‌కు పట్టణంలోని పాఖాల రోడ్ సెంటర్‌లో ఘనస్వాగతం పలికి ఆయన మాట్లాడారు. కార్యక్రమంలో బీజేపీ, బీజేవైఎం, బీజేపీ మోర్చా నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

రికార్డుల్లో అవకతవకలపై విచారణ



విచారణ చేస్తున్న అధికారులు

పర్వతగిరి, సెప్టెంబరు 6 : మండలంలోని వడ్లకొండకు చెందిన రైతు ఎర్రం మల్లయ్య తన భూమి ఇతరుల పేరుపై పట్టా చేశారని, రికార్డుల్లో తన పేరే లేదని ఇటీవల కలెక్టర్ కార్యాలయంలో ఫిర్యాదు చేశాడు. గత తహసీల్దార్ హయాంలో రికార్డులు అన్నీ తారుమారు చేశారని, ఇష్టారాజ్యంగా రికార్డులు మార్చారని ఆరోపించారు. ఈ సందర్భంగా రైతు మల్లయ్య మాట్లాడుతూ తనకు వంశపారంపర్యంగా వచ్చిన భూమిని రెవెన్యూ అధికారులు తనకు తెలియకుండానే వేరేవారి పేరుపై విరాసత్ పట్టా చేశారని మండిపడ్డారు. దీంతో రెవెన్యూ రికార్డుల్లో అవకతవకలపై శుక్రవారం అధికారులు క్షేత్రస్థాయిలో విచారణ చేపట్టారు. సర్వేయర్ శ్యామ్‌లాల్, జూనియర్ అసిస్టెంట్ రమేష్‌లు భూమికి సంబంధించిన వివరాలను సర్వే చేసి సేకరించారు. అనంతరం తహసీల్దార్ వెంకటస్వామి మాట్లాడుతూ కలెక్టర్ ఆదేశాల మేరకు వడ్లకొండ గ్రామంలో విచారణ చేపట్టాం. భూమికి సంబంధించిన రికార్డులు, క్షేత్రస్థాయిలో చేపట్టిన సర్వే, విచారణ నివేదికను రెండు రోజుల్లో కలెక్టర్‌కు అందిస్తామన్నారు.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి గాయాలు

వర్ధన్నపేట రూరల్, సెప్టెంబరు 6 : ద్విచక్ర వాహనం దుడ్డెను ఢీకొని ఇద్దరికి గాయాలైన సంఘటన మండలంలోని ఇల్లంద గ్రామంలో శుక్రవారం చోటు చేసుకుంది. స్థానికుల కథనం ప్రకారం... రాయపర్తి మండలంలోని కేశవపురం విద్యానగర్ తండాకు చెందిన సెతాప్ రాంబాబు, భూక్యా మాన్‌సింగ్‌లు మండలంలోని కడారిగూడెంలో మోటారు రిపేరు చేసేందుకు ద్విచక్ర వాహనంపై వెళ్తున్నారు. ఈ నేపథ్యంలో ఇల్లంద గ్రామ శివారులోని లక్ష్మీగార్డెన్ సమీపంలో వరంగల్ ఖమ్మం జాతీయ రహదారిపై అకస్మాత్తుగా దుడ్డె అడ్డం రావడంతో ఢీకొట్టారు. ఈ ఘటనలో దుడ్డె మృతిచెందగా, ఇరువురికి గాయాలు కావడంతో స్థానికులు వెంటనే వరంగల్ ఎంజీఎం ఆస్పత్రికి తరలించారు.

వాసవి క్లబ్ సేవలను వినియోగించుకోవాలి

గీసుగొండ, సెప్టెంబరు 6 : వాసవి క్లబ్ కాశిబుగ్గ వారి సేవలను సద్వినియోగం చేసుకోవాలని క్లబ్ అధ్యక్షుడు డాక్టర్ పుల్లూరి సంపత్‌కుమార్ అన్నారు. కే.జీ గుప్తా జయంతి సందర్భంగా నిర్వహించే క్లబ్ వారోత్సవాల్లో శుక్రవారం ఉపాధ్యాయులను, జర్నలిస్టులను సన్మానించారు. కార్యక్రమంలో కార్యదర్శి వీరభద్రయ్య, వైస్‌ప్రెసిడెంట్ పుల్లూరి రమేష్, శ్రీకాంత్, మోహన్‌రావు పాల్గొన్నారు.

రైతులకు భూ హక్కు పత్రాలను ఇప్పించాలి



ఎమ్మెల్యే రేవూరికి వినతిపత్రం ఇస్తున్న రైతు సంఘం నాయకులు

గీసుగొండ, సెప్టెంబరు 6 : వ్యవసాయ భూములు ఉన్న రైతులందరికీ హక్కు పత్రాలను ఇప్పించాలని రైతు సంఘం నాయకులు డిమాండ్ చేశారు. శుక్రవారం ఎమ్మెల్యే రేవూరి ప్రకాష్‌రెడ్డిని హన్మకొండలోని ఆయన నివాసంలో కలిసి వినతిపత్రం అందచేశారు. రైతుసంఘం రాష్ట్ర కన్వీనర్ సోమిడి శ్రీనివాస్ మాట్లాడుతూ రైతులకు ఉపయోగపడేలా చట్టాల రూపకల్పన జరగాలన్నారు. మోకా మీద ఉండి భూములను సేద్యం చేస్తున్నప్పటికీ రైతులకు భూ హక్కు పత్రాలు లేక రైతుభరోసా అందకుండా పోతుందన్నారు. కార్యక్రమంలో నాయకులు ఓదెల రాజయ్య, సిరుల రవిందర్, అంబయ్య, వజ్ర రాజు, శేఖర్ పాల్గొన్నారు.

పంట నష్టపోయిన రైతాంగాన్ని ఆదుకోవాలి

నర్సంపేట టౌన్, సెప్టెంబరు 6 : ఇటీవల కురిసిన భారీ వర్షాల వల్ల నష్టపోయిన రైతాంగాన్ని రాష్ట్ర ప్రభుత్వం ఆదుకోవాలని సీపీఐ(ఎంఎల్) మాస్‌లైన్ జిల్లా కార్యదర్శి చిర్ర సూరి డిమాండ్ చేశారు. పట్టణంలో శుక్రవారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ నష్టపోయిన రైతులకు ఎకరానికి రూ.25వేల వంతున పరిహారం అందించాలని, మృతుల కుటుంబాలకు రూ. 25 లక్షల ఎక్స్‌గ్రేషియా చెల్లించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో అడ్డూరి రాజు, లింగన్న, కొమురన్న, బుచ్చన్న తదితరులు పాల్గొన్నారు.

రైతులకు పంట నష్టం పరిహారం అందించాలి

సంగెం : వర్షాలకు దెబ్బతిన్న పంటలకు ప్రభుత్వం వెంటనే నష్ట పరిహారం అందించాలని అఖిల భారత కిసాన్ ఫెడరేషన్ జిల్లా అధ్యక్షుడు ఇస్మాయిల్ డిమాండ్ చేశారు. శుక్రవారం కుంటపల్లి, కాట్రపల్లి, వెంకటాపురం గ్రామాల్లో దెబ్బతిన్న వ్యవసాయ క్షేత్రాలను నాయకులతో కలిసి సందర్శించారు. ఆయన మాట్లాడుతూ భారీ వర్షాలకు దెబ్బతిన్న మొక్కజొన్న, పత్తి, మిరుప, పసుపు లాంటి పంటలు తీవ్రంగా దెబ్బతిన్నాయని, ప్రభుత్వం వెంటనే బాధిత రైతులను ఆదుకోవాలన్నారు. కార్యక్రమంలో గోనే రాంచంద్రం, రవి,సంపత్, శ్రీనివాస్,అశోక్, ఎల్లస్వామి, సాంబయ్య పాల్గొన్నారు.

విద్యుత్ మీటర్‌లు తీసుకోవాలి

గీసుగొండ, సెప్టెంబరు 6: విద్యుత్ మీటర్‌లు విధిగా తీసుకో వాలని, దీని ద్వారా 200 యూనిట్‌ల లోపు విద్యుత్ వాడకానికి గృహజ్యోతి ద్వారా ప్రభుత్వం ఇచ్చే ఉచిత సబ్సిడీ లభిస్తుందని ఎన్‌పీడీసీఎల్ డీఈ ఎస్.మల్లికార్జున్ అన్నారు. శుక్రవారం ధర్మారం, గొర్రెకుంట గ్రామాల్లో విద్యుత్ వినియోగదారులకు అవగాహనను కల్పించారు. రూ.938 విద్యుత్ మీటర్ పొందవచ్చన్నారు. కార్యక్రమంలో ఏడీఈ గోపు కమలాకర్, ఏఈలు మధుకర్, సురేందర్ పాల్గొన్నారు.

రావయ్యా.. గణపయ్యా..

నేటి నుంచి గణపతి నవరాత్రి ఉత్సవాలు

వాడవాడలా మండపాల ముస్తాబు

మండపాలకు తరలుతున్న వినాయక

వరంగల్ కల్చరల్, సెప్టెంబరు 6 : వినాయక చవితిని ఉత్సవాలకు జిల్లా వ్యాప్తంగా ఘనంగా ఏర్పాట్లు చేశారు. గణపతి నవరాత్రి ఉత్సవాలను శనివారం నుంచి ఆరంభం కానున్నాయి. గణనాథులను ప్రతిష్ఠించేందుకు మండపాల నిర్వాహకులు సర్వం సిద్ధం చేశారు. మండపాలను సర్వాంగ సుందరంగా తీర్చిదిద్దారు. విద్యుత్ అలంకరణలో మెరిసిపోతున్నాయి. ఆలయాలతోపాటు, వాడవాడలా గణపతి మండపాలను ఏర్పాటు చేశారు. తొమ్మిది రోజుల పాటు నిర్వహించే గణపతి నవరాత్రి ఉత్సవాల నిర్వాహకులకు పోలీసుల నుంచి అనుమతి తప్పతిసరిగా తీసుకోవాలి. ఈ సందర్భంగా మండపాల వద్ద నిర్వహణ ఎలా ఉండాలనేది పోలీసులు ఒక గైడ్ లైన్ ప్రకారం సూచిస్తున్నారు. నిర్వాహకులు ఆధార్ కార్డులు, వివరాలు ఫోన్ నంబర్లతో పోలీసు అధికారులకు దరఖాస్తు తీసుకొని అనుమతి తీసుకోవాలి.

- మండపాలకు తరలుతున్న విగ్రహాలు

గణపతి నవరాత్రి ఉత్సవాలకు శనివారం నుంచి ప్రారంభం కానున్న నేపథ్యంలో వినాయక విగ్రహాలను కొనుగోలు కేంద్రాల నుంచి నిర్వాహకులు మండపాలకు తరలిస్తున్నారు. రెండు రోజులుగా ఈ ప్రక్రియ సాగుతుండడంతో నగర వీధులు వినాయకుల తరలింపుతో సందడిగా మారాయి. మండపాలకు తొలిసారిగా రాష్ట్ర ప్రభుత్వం ఉచిత విద్యుత్ అందిస్తుందని సీఎం రేవంత్‌రెడ్డి ప్రకటించిన నేపథ్యంలో మండపాలకు ఉచితంగా విద్యుత్‌ను సిబ్బంది అందించనున్నారు.

పూజా సామగ్రి కొనుగోలుతో మార్కెట్లు కిటకిట..

వినాయక చవితి పర్వదినం సందర్భంగా పూజా సామగ్రి కొనుగోలుతో మార్కెట్లు కిటకిటలాడాయి. సిద్ధమైన 18రకాల పత్రులు కంకులు, వెలగపండు, మారేడుకాయ, గన్నేరు పూలు, పండ్లు, లిల్లీపూలు, చెరుకు గడలు, మామిడాకు, అరటి చెట్లు వివిధ సామగ్రిని అమ్మకందారులతో వరంగల్ నగరంలోని రహదారులన్నీ కొనుగోలుదారులతో రద్దీగా మారాయి. స్టేషన్‌రోడ్డు, పోస్టాఫీస్ సెంటర్, అండర్‌బ్రిడ్జి, హంటర్‌రోడ్డు, వరంగల్ చౌరస్తా, జేపీఎన్‌రోడ్డు, మండిబజార్, పోచమ్మ మైదాన్, బట్టల బజార్, చెమన్, ఎంజీఎం సెంటర్, వెంకట్రామ జంక్షన్, కాశిబుగ్గ జంక్షన్, రంగశాయిపేట, లేబర్ కాలనీ జంక్షన్ ప్రాంతాల్లో పూజ సామగ్రి విక్రయాలతో సందడిగామారాయి.

పూలు, పండ్లకు భలే గిరాకీ..

పండుగను పురస్కరించి చామంతి, బంతి, గులాబీ, లిల్లీ, వివిధ రకాల పూలు ధరలు అధికంగా పలికాయి. కిలో రూ. 400 నుంచి 600 వరకు పలికాయి. కాగడాల మల్లె పూలు కిలో వెయ్యి, పండ్లు, సేపులు, దానిమ్మ , బతాయితో పాటు అరటి పండ్లు డజన్ రూ. 80 పలుకుతున్నాయి. కొబ్బరికాయల అమ్మకాలు జోరుగా సాగుతున్నాయి.

భక్తి శ్రద్ధలతో పండుగ జరుపుకోవాలి.. : మంత్రి

హిందూ ధార్మిక ఆధ్యాత్మిక ప్రపంచానికి గణేషుడు ప్రథమ పూజ్యుడని, సకల శాస్త్రాలకు అధిపతిగా ఆటంకాలను తొలగించే విఘ్నేశ్వరుడిగా, బుద్ధికి జ్ఞానానికి ఆరాధ్యుడిగా ఉన్న గణపతి నవరాత్రి ఉత్సవాలు వినాయక చవితి పర్వదినాన్ని భక్తి శ్రద్ధలతో జరుపుకోవాలని దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ ఒక ప్రకటనలో కోరారు. సీఎం రేవంత్‌రెడ్డి ఆదేశాల మేరకు ఈ సంవత్సరం వినాయక మండపాలకు ప్రభుత్వం ఉచిత విద్యుత్ అందిస్తున్నట్లు మంత్రి సురేఖ తెలిపారు. ప్రభుత్వ మార్గదర్శకాలను అనుసరించి ఉత్సవ కమిటీలు మండపాల నిర్వాహకులు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని సూచించారు. ప్రజలంతా సుఖసంతోషాలతో ఉండాలని ఆకాంక్షించారు.



మట్టి వినాయకులను పంపిణీ చేస్తున్న కలెక్టర్

మట్టి వినాయకులనే పూజించాలి : కలెక్టర్

వరంగల్ కలెక్టరేట్ : పర్యావరణాన్ని పరిరక్షించేందుకు మట్టి వినాయకులనే పూజించాలని కలెక్టర్ సత్యశారద పిలుపునిచ్చారు. శుక్రవారం కలెక్టరేట్‌లో రాష్ట్ర కాలుష్య నియంత్రణ మండలి ఆధ్వర్యంలో ఈఈ సునీతతో కలిసి కలెక్టర్ మట్టి వినాయక ప్రతిమలను పంపిణీ చేశారు. కలెక్టర్ మాట్లాడుతూ మట్టి విగ్రహాలతో తయారు చేసిన గణపతులనే పూజించాలనే ఉద్దేశంతో ప్రభుత్వ పరంగా చేపడుతున్న కార్యక్రమం విజయవంతం చేయాలని కోరారు. పొల్యూషన్ కంట్రోల్‌బోర్డు ఆధ్వర్యంలో వరంగల్ జిల్లాకు 2వేల మట్టి విగ్రహాలు సరఫరా చేయడం జరిగిందని, వివిధ ప్రాంతాల్లోని ప్రజలకు మట్టి వినాయక విగ్రహాలను సరఫరా చేసేలా చర్యలు తీసుకుంటున్నామన్నారు. వివిధ రకాల రసాయనాలు, ప్లాస్టర్ ఆఫ్ పారిస్‌తో తయారు చేసే విగ్రహాల వల్ల ఏర్పడిన కాలుష్యంతో పర్యావరణానికి ముప్పు వాటిల్లే ప్రమాదం ఉందని కలెక్టర్ తెలిపారు.

ముస్తాబైన గణపతి మండపాలు

వర్ధన్నపేట రూరల్ : మండలంలోని ఆయా గ్రామాల్లో వినాయక చవితి సందర్భంగా గణపతి మండపాలు ముస్తాబయ్యాయి. వివిధ కుల సంఘాలు, యూత్ అసోసియేషన్‌ల ఆధ్వర్యంలో ఏర్పాటు చేస్తున్న గణపతి నవరాత్రి ఉత్సవాల సందర్భంగా నేడు గణనాధుడు మండలపాల్లో కొలువుదీరనున్నాడు. దీనిపై ఇప్పటికే పోలీసులు అవగాహన కల్పించడంతో పాటు ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా చర్యలు తీసుకుంటున్నారు.



నర్సంపేట ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో, సంగెం పాఠశాలలో, దేశాయిపల్లి పాఠశాలలో, ఉప్పరపల్లి పాఠశాలలో మట్టి వినాయకులను తయారు చేసిన విద్యార్థులు

రాష్ట్ర ఉత్తమ ప్రిన్సిపాళ్లు, లెక్చరర్‌ను అభినందించిన డీఐఈవో



రాష్ట్ర ఉత్తమ లెక్చరర్లను అభినందిస్తున్న డీఐఈవో

వరంగల్ ఎడ్యుకేషన్, సెప్టెంబరు 6: జాతీయ ఉపాధ్యాయ దినత్సోవాన్ని పురస్కరించుకొని రాష్ట్ర స్థాయిలో ఉత్తములుగా సత్కారం పొందిన జిల్లాలోని వివిధ జూనియర్ కళాశాలల ప్రిన్సిపాళ్లు, లెక్చరర్లను డీఐఈవో డాక్టర్ జి.శ్రీధర్‌సుమన్ అభినందించారు. శుక్రవారం హనుమకొండలోని డీఐఈవో కార్యాలయంలో ఉత్తములైన నర్సంపేట ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ పి.సంపత్‌కుమార్, వర్ధన్నపేట ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ జి.వెంకటయ్య, నర్సంపేట జూనియర్ కళాశాల హిందీ జూనియర్ లెక్చరర్ డాక్టర్ ఎల్.కొమురా రెడ్డిని డీఐఈవో శాలువా, పుష్పగుచ్ఛాలతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

ఉత్తమ ఉపాధ్యాయుడికి సన్మానం

నర్సంపేట టౌన్: గురుపూజోత్సవంలో భాగంగా జిల్లా ఉత్తమ ఉపాధ్యాయ అవార్డును పొందిన నర్సంపేట పట్టణంలోని ప్రభుత్వ మోడల్ హైస్కూల్‌లో గణితం ఉపాధ్యాయుడు కొత్త శ్యాం ప్రసాద్‌ను శుక్రవారం పాఠశాలలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో తోటి ఉపాధ్యాయులు శాలువాలు కప్పి ఘనంగా సన్మానించారు. తనకు అవార్డు రావడం వల్ల తనపై బాధ్యత మరింత పెరిగిందన్నారు. విద్యార్థుల విద్యాభివృద్ధికి మరింత కృషి చేస్తానన్నారు. కార్యక్రమంలో హెచ్‌ఎం శాంతకుమారి,ఉపాధ్యాయులు నందగోపాలస్వామి, మురళి, సుజాత, కుమారస్వామి, నరేందర్ పాల్గొన్నారు.

ఉత్తమ ఉపాధ్యాయులకు సన్మానం

గీసుగొండ : జిల్లా ఉత్తమ ఉపాధ్యాయులుగా ఎంపికైన మండలంలోని పలు పాఠశాలలకు చెందిన ఉపాధ్యాయులు ఆయా పాఠశాలల్లో శుక్రవారం ఘనంగా సన్మానించారు. ఉత్తమ ఉపాధ్యాయులుగా కలెక్టర్‌చే అవార్డులు తీసుకున్న శాయంపేటహవేలి పీఎస్ హెచ్‌ఎం రాజేశ్వరీ, వంచనగిరి ఉన్నత పాఠశాలలో కోట మధుకర్, వంచనగిరి కేజీబీవీలో సీఆర్టీ పెండ్యాల శోభ, కొమ్మాల ఉన్నత పాఠశాలలో మాధవీలతను ఆయా పాఠశాలల్లో ఉపాధ్యాయులు, విద్యార్థులు సన్మానించారు. కార్యక్రమంలో ఇన్‌చార్జ్ హెచ్‌ఎం కమల, ఉపాధ్యాయులు రాంగోపాల్‌రెడ్డి, హైమావతి, సలీంపాష దిలీప్‌కుమార్, లక్ష్మయ్య, కృష్ణ పాల్గొన్నారు.

ఉచిత వైద్య శిబిరం

గీసుగొండ, సెప్టెంబరు 6 : గంగదేవిపల్లి, విశ్వనాథపురం, నందనాయక్ తండా గ్రామాల్లో ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఆధ్వర్యంలో ఉచిత వైద్యశిబిరాలను శుక్రవారం నిర్వహించారు. డెంగీ, మలేరియా కిట్ల ద్వారా జ్వర బాధితులకు వైద్యపరీక్షలు నిర్వహించి మందులను పంపిణీ చేశారు. మండల వైద్యాధికారి దేవేందర్ మాట్లాడుతూ ప్రతి శుక్రవారం డ్రైడేను పాటించాలని సూచించారు. కార్యక్రమంలో డాక్టర్ సదానందం, డాక్టర్ జాబిల్లి, మమత, సీహెచ్‌వో మధుసూదన్‌రెడ్డి, ఏఎన్‌ఎంలు రత్నవల్లి, శ్రీనివాస్ పాల్గొన్నారు.

ఓపెన్ స్కూల్ విద్యను వినియోగించుకోవాలి

నెక్కొండ, సెప్టెంబరు 6 : ఆర్థిక పరిస్థితులు, కుటుంబ బాధ్యత ల కారణంగా మధ్యలో చదువుకు దూరమైన విద్యార్థులు ఓపెన్ స్కూల్ విద్యను వినియోగించుకోవాలని హై స్కూల్ హెడ్మాస్టర్ ఎం.రంగారావు కోరారు. తెలంగాణ సార్వత్రిక విద్యాపీఠం ఆధ్వర్యం లో నిర్వహిస్తున్న ఓపెన్ స్కూల్ వాల్ పోస్టర్‌లను శుక్రవారం ఆయన విడుదలచేశారు. వయస్సుతో సంబంధం లేకుండా ఓపెన్ స్కూల్ ద్వారా పదో తరగతి, ఇంటర్మీడియట్ విద్యను నేరుగా అభ్య సించే అవకాశం ఉందని తెలిపారు. ఇంటర్ విద్యను పూర్తిచేసిన వారు డిగ్రీ తదితర ఉన్నత విద్యను అభ్యసించే అవకాశం ఉందన్నారు. డిగ్రీ పూర్తిచేసిన వారు ప్రభుత్వ ఉద్యోగం పొందేందుకు అర్హులని చెప్పారు. కార్యక్రమంలో ఓపెన్ స్కూల్ అసిస్టెంట్ కో- ఆర్డినేటర్‌లు ఎం.నర్సయ్య ఎ.శ్రీదేవి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

పారిశుధ్యంపై నిర్లక్ష్యం చేయొద్దు

దుగ్గొండి, సెప్టెంబరు 6 : గ్రామాల్లో పారిశుధ్యంపై నిర్లక్ష్యంచేయొద్దని ఎప్ప టికప్పుడు పారిశద్యం తొలగించాలని జడ్పీసీఈవో, ఇన్‌చార్జ్ డీపీవో రాంరెడ్డి జీపీ సిబ్బందిని ఆదేశించారు. మండలం లోని తిమ్మంపేట, నారాయణతండా గ్రామాల్లో శుక్రవారం డ్రైడే ఫ్రైడే కార్యక్రమంలో భాగంగా గ్రామాలను సంద ర్శించి వాడవాడలా తిరుగుతూ పారిశుధ్యం పరిశీలన చేశారు. తిమ్మంపేటలో మురికి నీరు నిల్వ ఉండడంతో అసహనం వ్యక్తపరచి జీపీ సిబ్బంది తో తొలగించారు. ప్రజలు జ్వరాల బారినపడకుండా తగు సూచనలు చేయాలన్నా రు. నారాయణతండా శానిటేషన్ పనులు పూర్తి చేయాలని కార్యదర్శి శశిధర్ ను ఆదేశించారు. సందర్శించిన వారిలో ఎంపీడీవో లెక్కల అరుంధతి, ఎంపీవో శ్రీధర్‌గౌడ్, కార్యదర్శి నూనె వేణుప్రసాద్ తదితరులు ఉన్నారు.

గుడుంబా స్థావరంపై దాడి

వరంగల్ క్రైం, సెప్టెంబర్ 6 : గీసుగొండ పోలీస్ స్టేషన్ పరిధి లోని గొర్రెకుంట పారిశ్రామిక ప్రాంతంలో గుడుంబా స్థావరంపై శుక్రవారం టాస్క్‌ఫోర్స్ పోలీసులు దాడులు చేశారు. గొర్రెకుంట ప్రాంతంలో గుడుంబా తయారు, అమ్మకాలు జరుపుతున్న విజయ అనే నిందితురాలిని అదుపులోకి తీసుకుని ఐదు లీటర్ల గుడుంబా స్వాధీనం చేసుకున్నారు. అదుపులోకి తీసుకున్న విజయను విచారణ నిమిత్తం గీసుగొండ పోలీసులకు అప్పగించారు. ఈ విషయాన్ని టాస్క్‌ఫోర్స్ సీఐ రవికుమార్ ధృవీకరించారు.

ప్రజా సమస్యలను పరిష్కరించాలి

నర్సంపేట, సెప్టెంబరు 6 : నర్సంపేట పట్టణ ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను వెంటనే పరిష్కరించాలని ఎంసీపీఐ(యూ) జిల్లా కార్యదర్శి పెద్దారపు రమేశ్ డిమాండ్ చేశారు. పట్టణంలోని మునిసిపల్ కార్యాలయం ఎదుట శుక్రవారం ధర్నా కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మునిసిపాలిటీలో జరుగుతున్న అవినీతి, అక్రమాలపై విచారణ జరిపించాలని ఆయన డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఆపార్టీ రాష్ట్రకమిటీ సభ్యురాలు వంగల రాగసుధ, జన్ను రమేశ్, జగపతి, గుజ్జుల శివ, గనిపాకబాబు, గడ్డం స్వరూప, కుసుబాల సతీష్, బెజ్జంకి అచల, లావణ్య దేవమ్మ, ప్రమీల తదితరులు పాల్గొన్నారు.

ఎస్సైగా రాజేష్‌రెడ్డి బాధ్యతల స్వీకరణ



చెన్నారావుపేట, సెప్టెంబరు 6 : చెన్నారావుపేట ఎస్సైగా జి.రాజేష్‌రెడ్డి శుక్రవారం బాధ్యతలను స్వీకరిం చారు. ఇక్కడ ఎస్సైగా పనిచేస్తున్న ఎస్సై గూడ అరుణ్‌కుమార్ బదిలీపై నర్సంపేటకు వెళ్లడంతో ఆయన స్థానంలో హన్మకొండలో వీఆర్‌లో ఉన్న రాజేష్‌రెడ్డి బాధ్యతలను చేపట్టారు. ఈ సందర్భంగా పలువురు నూతన ఎస్సైకి శుభాకాంక్షలు తెలిపారు.

గురుకులంలో ఫుడ్‌సేఫ్టీ అధికారుల తనిఖీలు

రాయపర్తి, సెప్టెంబరు 6: మండల కేంద్రంలోని సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాల, కళాశాలలో శుక్రవారం ఫుడ్‌సేఫ్టీ అధికారులు ఆకస్మిక తనిఖీలు చేపట్టారు. సేఫ్టీ అధికారి కృష్ణమూర్తి ఆధ్వర్యంలో గురుకులంలో భోజనశాలను పరిశీలించి, వంటకాలను క్షుణ్ణంగా తనిఖీ చేశారు. విద్యార్థులకు అందించే భోజనంలో అధికారులు నాణ్యత పాటించాలని, ఎలాంటి నిర్లక్ష్యం చేసిన తగిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

తొలగించిన టీచర్లను విధుల్లోకి తీసుకోవాలి

పర్వతగిరి, సెప్టెంబరు 6 : మండల కేంద్రంలోని సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాలలో తొలగించిన ఔట్‌సోర్సింగ్, కాంట్రాక్ట్, పార్ట్‌టైమ్ టీచర్లను విధుల్లోకి తీసుకోవాలని పేరెంట్స్ కమిటీ ఆధ్వర్యంలో శుక్రవారం ప్రిన్సిపాల్ అపర్ణకు వినతి పత్రం అందించారు. కార్యక్రమంలో కమిటీ చైర్మన్ ఇల్లందుల రాణి, వైస్‌చైర్మన్ వేల్పుల కుమారస్వామి, సభ్యులు మాంకాల యాదగిరి, మొలుగూరి సుమన్, సింగారపు గోపాల్, సీనపెల్లి రాజు, మాదాసి కృష్ణ, గోగుల లావణ్య ఐలపాక స్వప్న తదితరులు పాల్గొన్నారు.

సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండాలి

దుగ్గొండి, సెప్టెంబరు 6 : సైబర్ నేరాలపై ప్రజలు అప్రమత్తం గా ఉండాలని, మాదకద్రవ్యాలకు మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని ఏసీపీ కిరణ్‌కుమార్ కోరారు. మండలంలోని మందపల్లి లో శుక్రవారం సాయంత్రం కార్డెన్ సెర్చ్ నిర్వహించారు. సబ్ డివిజన్ పోలీసుల ఆధ్వర్యంలో గ్రామంలోని అన్నివాడలు తిరుగుతూ తనిఖీలు చేపట్టారు. తనిఖీలలో 45 ద్విచక్రవాహనాలు, ఒక ఆటో, ఐదు లీటర్ల గుండుబాను స్వాధీనం చేసుకున్నారు. ప్రజలు ఉద్దేశించి మాట్లాడుతూ సమాచారం తెలుసుకొని సైబర్ నేరాలు చేస్తున్నారని, ఆర్థికపరమైన సమాచారం ఎవరికీ ఇవ్వకుండా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు.



బ్రిడ్జి పనులను పరిశీలించిన మాజీ ఎమ్మెల్యే

సంగెం, సెప్టెంబరు 6: ఇటీవల కురిసిన వర్షాలకు కొట్టుకుపోయిన రోడ్డు, నిర్మాణ పనులను పరకాల మాజీ ఎమ్మెల్యే చల్లా ధర్మారెడ్డి పరిశీలించారు. శుక్రవారం నల్లబెల్లి-నార్లవాయి గ్రామాల మధ్య వర్షంకు కొట్టుకుపోయిన రోడ్డును పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ దెబ్బతిన్న రోడ్లకు నిధులు అందించలేని పరిస్థితిలో ప్రభుత్వం ఉందని ఆరోపించారు. కార్యక్రమంలో మండల బీఆర్ఎస్ అధ్యక్షుడు పసునూరి సారంగపాణి, తాజా మాజీ జడ్పీటీసీ గూడ సుదర్శన్‌రెడ్డి, తాజా మాజీ వైస్ ఎంపీపీ బుక్క మల్లయ్య మాజీ ఎంపీపీ దొనికెల మల్లయ్య, మాజీ మండల కో-ఆప్షన్ మెంబర్ మాన్సూర్‌అలీ, సంగెం సొసైటీ చైర్మన్ వేల్పుల కుమారస్వామి యాదవ్ పాల్గొన్నారు.



జయ కుమార్

వివేక్

పచ్చపిండితో, పప్పు దినుసులతో తీర్చిదిద్దిన గణపతి

గణపతి ప్రతిరూపాలు

నర్సంపేట, సెప్టెంబరు 6 : వినాయక చవితిని పురస్కరించుకొని సూక్ష్మ కళాకారుడు గణపతి ప్రతిమను పచ్చపిండితో తయారు చేశారు. నర్సంపేట పట్టణానికి చెందిన మైక్రో ఆర్టిస్టు శ్రీరామోజు జయకుమార్ పర్యావరణ గణపతిని అర ఇంచుకన్నా తక్కువ పరిమాణంలో చెట్టును పట్టుకున్నట్లు పచ్చపిండితో గణపతి ప్రతిరూపాన్ని తీర్చిదిద్దారు.

• నర్సంపేట టౌన్ : పచ్చదనాన్ని, పర్యావరణాన్ని పరిరక్షించాలనే సందేశాన్ని ఇస్తూ పప్పు దినుసులతో గణేశ్ చిత్రపటాన్ని చిన్నారి కాసుల వివేక్ రూపొందించాడు. నర్సంపేట పట్టణానికి చెందిన కాసుల రవికుమార్-శోభారాణిల కుమారుడు వివేక్ నాల్గో తరగతి చదువుతున్నాడు.

బాలికల భవిష్యత్తుపై దృష్టి సారించాలి

నెక్కొండ, సెప్టెంబరు 6 : రేపటి భావి భారత భవితవ్యానికి ఆధునిక భారతదేశానికి మార్గదర్శకాలుగా నిలిచే బాలికల భవిష్యత్తుపై ప్రత్యేక దృష్టి సారించాలని బాలికల రక్షణ అధికారిణి పద్మలత అన్నారు. యునిసెఫ్ వారి సహకారంతో గ్రామీణ పేదరిక నిర్మాణ సంస్థ ఆధ్వర్యంలో భారతి మండల సమైక్య కార్యాలయంలో మార్త లావణ్య అధ్యక్షతన శుక్రవారం నిర్వహించిన కార్యక్రమంలో ఆమె మాట్లాడారు. కార్యక్రమంలో వెలుగు ఏపీఎం శ్రీనివాస్, ఉమెన్ చైల్డ్ వెల్ఫేర్ సభ్యుడు నర్సింహస్వామి, సీసీలు రవీందర్, ఏకాంబ్రాం, మాణిక్యం, శారద, వెంకటయ్య, మండల సమాఖ్య ఓబీ నాగరాణి, పద్మ, శ్వేత తదితరులు పాల్గొన్నారు.

పోషకాహారాన్ని తీసుకోవాలి

వర్ధన్నపేట రూరల్, సెప్టెంబరు 6 : మహిళలు, గర్భిణులు, బాలింతలు, పిల్లలు పోషక విలువలు కలిగిన ఆహారాన్ని తీసుకోవాలని ఐసీడీఎస్ సూపర్ వైజర్‌కోడల చంద్రకళ అన్నారు. శుక్రవారం మండలంలోని ఇల్లందలో పోషణ మాసం సందర్భంగా అవగాహన కల్పించారు. కార్యక్రమంలో పల్లె దవాఖానా వైద్యులు సురేష్, కమల కిషర్, ఏఎన్‌ఎం అంగన్‌వాడీ టీచర్లు పాల్గొన్నారు.

సట్టా బెట్టింగ్‌పై టాస్క్‌ఫోర్స్ దాడులు

వర్ధన్నపేట రూరల్, సెప్టెంబరు 6 : సట్టా, మట్కా బెట్టింగ్ పై టాస్క్‌ఫోర్స్, సివిల్ పోలీసులు మెరుపు దాడి చేసిన సంఘటన మండలంలోని నల్లబెల్లిలో శుక్రవారం రాత్రి చోటుచేసుకుంది. వర్ధన్నపేట పోలీసుల కథనం ప్రకారం... వరంగల్ ఉర్సు కరీమాబాద్‌కు చెందిన ఎండీ.యాకూబ్, ఎండీ.అన్వర్ అనే వ్యక్తులు ఆన్‌లైన్‌లో సట్టా, మట్కా ద్వారా డబ్బులు సంపాదించవచ్చని గ్రామీణ ప్రాంత ప్రజలను నమ్మించి, కొందరు వ్యక్తులతో గ్రామంలో బెట్టింగ్ పెట్టిస్తుండగా విశ్వసనీయ సమాచారం మేరకు, సమాచారం తెలుసుకుని పోలీసులు దాడులు చేయగా వారు పట్టుబడ్డారు. వారి నుంచి రూ.33,150, రెండు సెల్ ఫోన్లు స్వాధీనం చేసుకున్నారు. ఇద్దరిపై కేసు నమోదు చేసినట్లు వర్ధన్నపేట ఎస్ఐ ప్రవీణ్ కుమార్ తెలిపారు. ఈ దాడుల్లో టాస్క్‌ఫోర్స్ ఏసీపీ మధుసూదన్, సీఐ పవన్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

పంట రుణాలను రెన్యూవల్ చేయాలి

ఖానాపురం, సెప్టెంబరు 6 : రైతుల పంట రుణాలను త్వరితగతిన రెన్యూవల్ చేయాలని జిల్లా వ్యవసాయాధికారి అనురాధ అన్నారు. శుక్రవారం ప్రాథమిక వ్యసాయ సహకారం సంఘంను సందర్శించి పంట రుణమాఫీలోని సమస్యలు, క్రాప్‌లోన్ల రెన్యూవల్ పురోగతిని పరిశీలించారు. రంగాపురంలోని పత్తి, వరి పంటలను మండల వ్యసాయాధికారి బోగ శ్రీనివాస్‌తో కలిసి పరిశీలించారు. మండల కేంద్రంలోని రైతువేదికలో పంట రుణమాఫీ ఫిర్యాదు దరఖాస్తుల స్వీకరణ, ఫ్యామిలీ గ్రూపింగ్ యాప్‌లో అప్ లోడింగ్ కార్యక్రమాలను పర్యవేక్షించారు. ఎరువుల దుకాణాలను తనిఖీ చేశారు. ఈ పాస్ ద్వారానే గరిష్ట ధరను మించకుండా ఎరువుల విక్రయాలు జరపాలని డీలర్లకు సూచించారు.

ఎయిడ్స్‌పై అవగాహన కలిగి ఉండాలి

వర్ధన్నపేట, సెప్టెంబరు 6 : ఎయిడ్స్‌పై ప్రతీ ఒక్కరు పూర్తిస్థాయిలో అవగహన కలిగి ఉండాలని సర్వోదయ యూత్ ఆర్గనైజేషన్ సంస్థ ప్రాజెక్టు మేనేజర్ శాంతరాజ్ అన్నారు. శ్రుకవారం వర్ధన్నపేట పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో తెలంగాణ రాష్ట్ర ఎయిడ్స్ నియంత్రణ మండలి సహకారంతో అవగహన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ వెంకటయ్య, వైస్ ప్రిన్సిపాల్ రాజేంద్రప్రసాద్ అధ్యాపకులు సువర్ణదేవి, తిరుపతి, సంస్థ సిబ్బంది ప్రవళిక, రాజ్‌కుమార్ పాల్గొన్నారు.